ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

ఆదివారం | 11-10- 2026 | సంపుటి: 17, సంచిక: 190, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



# హైటెన్షన్

## అడుగడుగునా అరెస్టులు.. నిర్బంధాలు.. ముళ్లకంచెలు..

## సీఈసీ జ్ఞానేశ్‌కు వ్యతిరేకంగా సీజేపీ నిరసనలు

### విమానంలోనే అభిజిత్ దీప్కే అరెస్ట్

### 7,000 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

### ఎంత మంది పోలీసులను పంపినా వెనక్కి తగ్గబోం: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 10: దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికిపోతున్నది. అడుగడుగునా అరెస్టులు.. నిర్బంధాలు.. ముళ్లకంచెలు.. పోలీసుల మోహరింపు.. ఇంటర్నెట్ బంద్.. ఇలా ఆందోళనలపై ఆంక్షలతో జంతర్ మంతర్ సహా పరిసరాలన్నీ ఎమర్జెన్సీని తలపిస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనన్న హైటెన్షన్ వాతావరణం నెలకొన్నది. ఈ నెల 6న ఇండీ కూటమి ర్యాలీతో మొదలైన నిరసనల హోరు శనివారం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పోరాటంతో మరింత ఉధృతమైంది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ముందుగా ప్రకటించినట్లు శనివారం ఉదయం జంతర్‌మంతర్‌లో ధర్నాకు సీజేపీ సిద్ధమైంది. మాజీ ముఖ్యమంత్రు లు మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, పినరయ్ విజయన్, మాణిక్ సర్కార్ సహా ప్రతిపక్ష పార్టీలు కూడా 'కాక్రోచ్'కు మద్దతుగా నిరసనలకు దిగాయి. అయితే.. శుక్రవారం రాత్రే జంతర్‌మంతర్ పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. శనివారం నిరసన తెలిపేందుకు ముంబై నుంచి విమానంలో బయలుదేరిన సీజేపీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే, ఆయన అనుచరులను ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానంలోనే అరెస్ట్ చేశారు.

తరువాయి 2వ పేజీలో...



## రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం

# తీవ్రంగా ఉంది

### ఈ స్థితిలో యాసంగి పంటలు వేస్తే దారుణంగా ఉంటుంది

- కావాల్సినన్ని పనిదినాలు కల్పిస్తాం..
- అదనపు రేషన్ ఇస్తాం
- రాష్ట్రంలోని రైతులకు విజ్ఞప్తి చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్
- విద్యుత్తును, నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు అవగాహన
- సీఎం రేవంత్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయాలు

హైదరాబాద్, అక్టోబరు 10 (ప్రజాకలం) : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీనికి అవసరమైన కార్యాచరణను అమలు చేయడానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా, పంటలు, తాగునీరు, విద్యుత్తు వంటి కీలక సమస్యలపై దృష్టి సారించింది. ఈ గడ్డు కాలం నుంచి ఎలా గట్టెక్కాలన్న దానిపై సీరియస్‌గా ఆలోచిస్తోంది. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి శనివారం ఎల్‌నినో ప్రభావంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు ఇచ్చిన క్షేత్రస్థాయి నివేదికలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి ఓ నిర్ణయానికి వచ్చారు. ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం నెలకొందని, ఈ దృష్ట్యా రబీ సీజన్‌లో ఎలాంటి పంటలు వేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేయనున్నారు. నిజానికి, ఈనెల 12న ఎల్‌నినో ప్రభావంపై మంత్రులతో సీఎం సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది.

తరువాయి 2వ పేజీలో...

## రూ. 70 కోట్లతో అభివృద్ధి పనులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పోలేపల్లి లో రూ. 4.65 కోట్లతో బిటి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి



పాలేరు అక్టోబర్ 10(ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం రూరల్ మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా రూ. 4.65 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు

తరువాయి 2వ పేజీలో...

## శ్రీరాంసాగర్ నుంచి సాగునీరు విడుదల

### రైతులకు ఊరట సోమవారం నాటికి పెద్దపల్లి ఆయకట్టుకు నీరు

### ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయ రమణారావు

పెద్దపల్లి అక్టోబర్ 10: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రస్తుత వర్షాకాలం పంటలను కాపాడేందుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని శనివారం విడుదల చేశారు.నిజామాబాద్ జిల్లా రేవెల్లి డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని డి-86,డి-83 ప్రధాన కాలువల ద్వారా పెద్దపల్లి నియోజకవర్గంలోని వ్యవసాయ క్షేత్రాలకు సోమవారం నాటికి సాగునీరు చేరుకుంటుందని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఎండిపోకుండా చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకే ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు చొరవ చూపినట్లు ఆయన పేర్కొన్నారు.పంటలు చేతికి వచ్చే వరకు రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని,అన్నదాతలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.అందుబాటులోకి వచ్చిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకుంటూ,పొదుపుగా వాడుకోవాలని సూచించారు.రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని నీటి విడుదలకు అనుమతించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు విజయ రమణారావు ధన్యవాదాలు తెలిపారు.



# రిలయన్స్‌పై మస్క్ అక్కసు

### బీజేపీకి ప్రచారం చేసే సంస్థకు భారీ నిధులు

### పత్రికలు, చానళ్ల కథనాల స్క్రీన్ షాట్లతో పోస్టులు

### తిప్పికొట్టిన భారత్ – నిష్పక్షపాతంగానే నిబంధనలు

### టెలికం మంత్రి జ్యోతిరాదిత్య

న్యూఢిల్లీ, అక్టోబరు 10 : 'స్టార్ లింక్' వ్యవహారంలో రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీని లక్ష్యంగా స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ మాటల దాడి పెంచారు. బీజేపీకి రాజకీయంగా ప్రచారం చేసి పెట్టడానికి అంబానీ రూ.కోట్లు వెచ్చిస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి సోషల్ మీడియాలో ప్రచారం చేసిపెడుతున్న ఓ సంస్థకు ముకేశ్ అంబానీ భారీగా నిధులు అందిస్తున్నారంటూ పత్రికలు, చానళ్లలో వచ్చిన కొన్ని కథనాల స్క్రీన్‌షాట్లను మస్క్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. రిలయన్స్‌తో సంబంధం ఉన్న ఓ కంపెనీ బీజేపీ రాజకీయ అవసరాల కోసం పెద్ద ఎత్తున విరాళాలను సేకరిస్తోందని మస్క్ ఆరోపించారు. 'ఫేస్‌బుక్‌లో బీజేపీకి ఆదరణ కోసం పనిచేస్తున్న కంపెనీకి రిలయన్స్ దన్నుగా




ఎందుకుంది?' అంటూ 2022లో 'అల్ జజీరా' ఒక కథనం ప్రసారం చేసింది. రిలయన్స్ బీజేపీకి రూ. 385 కోట్లు, శివసేనకు రూ.25 కోట్లు ఎన్నికల బాండ్ల ద్వారా సమకూర్చిందంటూ 2024లో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ఒక కథనం వచ్చింది. ఈ రెండింటినీ షేర్ చేస్తూ, ముకేశ్ అంబానీపై ఎలాన్ మస్క్ తన అక్కసును వెళ్లగక్కారు. కొన్నిరోజులుగా అంబానీ లక్ష్యంగా మస్క్ విమర్శల దాడి సాగిస్తున్నారు.

తరువాయి 2వ పేజీలో...

# దుర్గాదేవి ఆగమనం

### యువతలో నయా జోష్

### - అమ్మవారి స్వాగతానికి యువత వినూత్న ప్రయత్నాలు

3



## దుర్గా నవరాత్రులకు పటిష్ట భద్రత

### మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల్ ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాకలం)

జగిత్యాల జిల్లా దుర్గా నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి (దసరా) పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. జిల్లాలో దుర్గాదేవి మండపాలు, దేవాలయాలు,

తరువాయి 2వ పేజీలో...

## కేసీఆర్ పాలనలోనే

# తెలంగాణకు స్వర్ణయుగం



### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ – ఘనంగా బీఆర్ఎస్ దశాబ్ది ఉత్సవాలు

### అమరవీరులకు నివాళులర్పించిన బీఆర్ఎస్ శ్రేణులు

పెద్దపల్లి,అక్టోబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో అద్భుత ప్రగతి సాధించి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు,రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మమతా రెడ్డి,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ తదితరులతో కలిసి ఆయన తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లపాటు సంక్షేమం, అభివృద్ధి ప్రజల గడపగడపకూ చేరాయని గుర్తుచేశారు.రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్,కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు, రైతుబంధు,రైతుబీమా పథకాలతో వ్యవసాయ రంగాన్ని నిలబెట్టారని కొనియాడారు.


తరువాయి 2వ పేజీలో...

# ఎక్సైజ్ శాఖకు మళ్లీ ఆయుధాలు

### ప్రతిపాదనలు పంపేందుకు రంగం సిద్ధం

### గతంలో నక్సల్స్ భయంతో వెనక్కి ఇచ్చిన అధికారులు

హైదరాబాద్, అక్టోబరు 10 (ప్రజాకలం) : రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి స్మగ్లర్ల ఆగడాలు పెరుగుతుండటం, ఎక్సైజ్ సిబ్బందిపై దాడులు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఆ శాఖకు మళ్లీ ఆయుధాలు కేటాయించే దిశగా కీలక అడుగు పడింది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఏడాది క్రితం ఎక్సైజ్ సిబ్బందికి ఆయుధాలు ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో దానిపై సమగ్ర ప్రతిపాదనలు పంపేందుకు రంగం సిద్ధమయింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ క్యూర్ పరిధిలోని ఆ శాఖ అధికారులతో ఈ విషయంపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆయుధాలు కేటాయించడానికి అంగీకరిస్తే.. ఏ స్థాయి అధికారులకు ఇవ్వాలనే దానిపై అభిప్రాయాలు సేకరించారు. గతంలో నక్సల్స్ ప్రభావం ఉన్న సమయంలో భద్రతా కారణాల దృష్ట్యా ఎక్సైజ్ సీఐ స్థాయి అధికారుల వద్ద ఉన్న ఆయుధాలను వారే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి వెనక్కి అప్పగించారు. కాలక్రమేణా పరిస్థితులు మారుతూ వచ్చాయి. ప్రస్తుతం డ్రగ్స్, నాన్‌డ్యూటీ




పెయిడ్ లిక్కర్ గంజాయి అక్రమ రవాణా విపరీతంగా పెరిగిపోవడం, స్మగ్లర్లు ఎక్సైజ్ సిబ్బందిపై దాడులకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలే నిజామాబాద్‌లో తనిఖీల సమయంలో అక్రమార్కులు మహిళా కానిస్టేబుల్‌ను వాహనంతో ఢీకొట్టి ప్రాణాలు తీసిన ఘటన కలకలం రేపింది. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో సిబ్బంది ఆత్మరక్షణకు, విధుల్లో భద్రతకు ఆయుధాలు తప్పనిసరి అనే అభిప్రాయం బలపడింది. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే పోలీస్ శాఖతో పూర్తి సమన్వ యంతో వెళ్లాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. బార్లు, మద్యం షాపుల ఎక్సైజ్ రెంటల్ ఫీజుల వసూలు, కొత్త బార్ల దరఖాస్తుదారులకు గైడెన్స్ వంటి పరిపాలనాంశాలపై కూడా చర్చించారు. అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాషిన్ ఖురేషి, ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ అంజన్‌రావుతో పాటు పలువురు అధికారులు సమావేశంలో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# హైటెన్షన్

మొదటి పేజీ తరువాయి...

ఇలాంటి పరిస్థితులు ఇందిరాగాంధీ హయాంలో కూడా లేవని.. ఎమర్జెన్సీని మించి మోదీ సర్కార్ వ్యవహరిస్తున్నదని దీప్కే మండిపడ్డారు. బస్టాండ్‌లో ధర్నాకు దిగిన మమతా బెనర్జీని, ర్యాలీగా బయలుదేరిన అర్విండ్ కేజ్రీవాల్‌ను, మద్దతు తెలిపేందుకు వచ్చిన పినరయ్ విజయన్, మాణిక్ సర్కార్ సహా దాదాపు మూడువేల మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టుల సందర్భంగా తీవ్ర తోపులాట జరిగింది.

**విమానం దిగకముందే..!**

కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కేతోపాటు ఆ పార్టీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా తదితరులు జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొనేందుకు శనివారం ఉదయం ముంబై నుంచి విమానంలో ఢిల్లీకి బయలుదేరారు. హస్తినలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ కాగానే.. అప్పటికే అక్కడికి చేరుకున్న ఐబీ, సీఐఎస్ఎఫ్, ఢిల్లీ పోలీసులు విమానంలోకి వెళ్లారు. ముఖ్యంగా మహిళా పోలీసులు ముందుండి.. దీప్కే సహా సీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. 'విమానంలో నుంచి దిగకముందే అరెస్ట్ చేయడానికి పోలీసులు వస్తున్నారు చూడండి. రండి మేడమ్.. రండి! అరెస్ట్ చేయండి. మేం భయపడం. ఇందిరాగాంధీ హయాంలో కూడా ఇలాంటి నిర్బంధాలు ఈ దేశం చూడలేదు. కానీ, ఇప్పుడు ఎమర్జెన్సీని మించి పరిస్థితులు కనిపిస్తున్నాయి. వెనక్కి తగ్గబోం. సీఈసీ జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు, సర్‌ను రద్దు చేసే వరకు మా పోరాటం ఆగదు' అంటూ విమానంలోనే మీడియాతో దీప్కే మాట్లాడుతూ కనిపించారు. ఈ వీడియోను సీజేపీ తన సోషల్ మీడియా ఖాతాలో విడుదల చేసింది. అరెస్టును ముందే ఊహించిన అభిజిత్ దీప్కే ముంబై నుంచి బయలుదేరేటప్పుడే ఓ ప్రకటన రిలీజ్ చేశారు. 'నన్ను, మా మిత్రులను పోలీసులు అరెస్ట్ చేసినా.. ఎవరూ వెనక్కి తగ్గొద్దు. శాంతియుతంగా, చట్టబద్ధంగా నిరసన తెలపాలని కోరుతున్న. ప్రజల ఆస్తులకు గానీ, ప్రభుత్వ ఆస్తులకు గానీ ఎలాంటి నష్టం కలిగించకుండా నిరసనను కొనసాగిద్దాం' అని పిలుపునిచ్చారు. యువతను చూసి కేంద్ర ప్రభుత్వం ఎంత భయపడుతున్నదో ప్రస్తుత పరిస్థితులు చూస్తే అర్థమవుతున్నదని ఆయన అన్నారు. ఢిల్లీ ఏమైనా మోదీ, అమిత్ షా ప్రైవేట్ ఆస్తులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, అభిజిత్ దీప్కే, ఆయన అనుచరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు గుర్తుతెలియని ప్రాంతాలకు తరలించారు.

**దీదీ, కేజ్రీ, విజయన్, మాణిక్ సహా..**

సీజేపీ నిరసనలకు మద్దతుగా ఢిల్లీ జంతర్ మంతర్‌కు ప్రతిపక్ష పార్టీలతోపాటు ప్రజా సంఘాల నాయకులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు భారీగా బయలు దేరగా.. ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేశాను. నిర్బంధంలోకి తీసుకున్నారు. కొందరిని గృహనిర్బంధం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చీఫ్, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ(దీదీ) తన పార్టీ నేతలతో కలిసి సౌత్ అవెన్యూలోని ఓ బస్టాండ్‌లో ధర్నాకు దిగారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని, ఆయన రాజీనామా చేయాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. మమతతోపాటు టీఎంసీ నేతలు డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్ సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి.. ద్వారకా నార్త్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమను పోలీసులు కిడ్నాప్ చేశారని, ఇక్కడి నుంచి కదలబోమంటూ ఠాణాలోనే దీదీ ధర్నాకు దిగారు. ఇక, ఢిల్లీలోని అరవింద్ కేజ్రీవాల్ ఇంటి పరిసరాల్లో తెల్లవారుజామునే పోలీసులు భారీగా మోహరించారు. జంతర్ మంతర్‌కు అనుచరులతో ఆయన బయలుదేరేందుకు సిద్ధమవగా అరెస్ట్ చేశారు. విమానంలోనే కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులను అరెస్ట్ చేయడమంటేనే మోదీ ఎంత భయపడుతున్నారో అర్థమవుతుందని కేజ్రీవాల్ అన్నారు. ఈ దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని, వారికి తామంతా మద్దతిస్తామని తెలిపారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ప్రముఖ యూట్యూబర్ ధృవ్ రాఠీని గురుగ్రామ్‌లోని నివాసంలోనే పోలీసులు నిర్బంధించారు. అనంతరం అరెస్ట్ చేశారు. కేరళం మాజీ సీఎం పినరయ్ విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా సీజేపీకి మద్దతుగా జంతర్ మంతర్‌కు ర్యాలీగా బయలుదేరిన పలువురు సుప్రీంకోర్టు లాయర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక, ముంబై సహా ఇతర ఏరియాల్లోనూ అరెస్టుల పర్వం కొనసాగింది. ముంబైలో నిరసనకు దిగిన నటుడు ఇమ్రాన్ ఖాన్, యాక్టివిస్ట్ తుషార్ గాంధీ సహా 400 మందిని అదుపులోకి తీసుకున్నారు.

**నేడు కూడా సీజేపీ భారీ ఆందోళనలు**

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా, సీజేపీ పోరాటానికి మద్దతుగా ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చినవారిలో దాదాపు 7వేల మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వైపు ఎవరు వెళ్లినా.. అదుపులోకి తీసుకున్నారు. మద్దతుగా ఎక్కడ నిరసనలు జరిగినా అడ్డుకున్నారు. కాగా, అరెస్టు చేసినవాళ్లలో చాలా మందిని రాత్రి పోలీసులు విడుదల చేసినప్పటికీ ఇంకా సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే సహా పలువురిని రిలీజ్ చేయలేదు. దీంతో ఆదివారం భారీ ఆందోళనలకు సీజేపీ పిలుపునిచ్చింది.

**'జానీ జానీ ఎస్ పాపా..**
**జ్ఞానేశ్‌కుమార్ నో పాపా'**
**సెటైరికల్ పాట పాడిన మమత**

జంతర్ మంతర్‌లో నిరసనకు బయలుదేరే ముందు టీఎంసీ చీఫ్, బెంగాల్ మాజీ సీఎం మమతాబెనర్జీ ఓ సెటైరికల్ పాట పాడారు. 'జానీ జానీ ఎస్ పాపా, జ్ఞానేశ్‌కుమార్ నో పాపా.. జానీ జానీ ఎస్ పాపా, జ్ఞానేశ్‌కుమార్ అరెస్ట్ పాపా.. జానీ జానీ ఎస్ పాపా, మోదీ సర్కార్ నో పాపా..' అంటూ పాట రూపంలో విమర్శలు గుప్పించారు. ఓట్ల చోరీకి మోదీ సర్కార్ పాల్పడుతున్నదని, ఇందుకు జ్ఞానేశ్‌కుమార్ సహకరిస్తున్నారని ఆమె ఆరోపించారు.

# రిలయన్స్‌పై మస్క్ అక్కసు

మొదటి పేజీ తరువాయి...

'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ అంబానీ..' అంటూ శుక్రవారం సంచలన వ్యాఖ్యతో మస్క్ పోస్టు పెట్టారు. ఉపగ్రహ ఇంటర్నెట్ రంగంపై తన గుత్తాధిపత్యం నిలుపుకొనేందుకు ముకేశ్ అంబానీ ప్రయత్నిస్తున్నారని ఆ పోస్టులో ఆరోపించారు. "భారత్‌లో స్టాక్ లింక్ ప్రవేశానికి వ్యతిరేకంగా శక్తివంతమైన ఆర్థిక ప్రయోజనాలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన సంపన్న వర్గాలు మా రాకను ఇష్టపడటం లేదు." అని విమర్శించారు. "నన్ను క్షమించండి అంబానీ గారు! భారత్‌కు మీరే నిజమైన బాస్ అని గ్రహించలేకపోయాను. భారత పౌరులను దోచుకునే అవకాశం వదులుకోవాలని మీరు అనుకోరు. అలాంటప్పుడు స్టార్ లింక్‌ను ఎలా అనుమతిస్తారు?" అంటూ వ్యాఖ్యానించారు.

**మేం స్వతంత్రులం: జ్యోతిరాదిత్య**

మస్క్ వరుస విమర్శలపై కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్పందిస్తూనే ఉంది. టెలికాం, ఉపగ్రహ సేవలకు సంబంధించిన నిబంధనలు నిష్పక్షపాతంగా, పక్కాగా రూపొందాయని వివరించింది. ఎంపిక పద్ధతిని అనుసరిస్తున్నామనేది అపోహ మాత్రమేనని తేల్చింది. ఎలాన్ మస్క్ 'స్టార్ లింక్', రిలయన్స్ 'జియో', భారతి 'వన్ వెబ్'... దేశంలో ఉపగ్రహ ఇంటర్నెట్ లైసెన్స్ పొందాయని కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వివరించారు. మరో సంస్థ అమెజాన్ ఆసక్తి వ్యక్తీకరణను ప్రకటించిందని తెలిపారు. రెవెన్యూ ఆధారంగా చార్జీలను నిర్ణయించి తర్వాత, స్పెక్ట్రమ్‌ను కేటాయిస్తామని తెలిపారు. రక్షణ షరతులను అంగీకరించే దాన్నిబట్టి వాటికి అనుమతులు లభిస్తాయన్నారు. ఏ రంగంలోనూ గుత్తాధిపత్యం భారత్ అంగీకరించబోదని తేల్చిచెప్పారు. తమకు వినియోగదారుల సౌకర్యమే ముఖ్యమన్నారు. "సాంకేతికత విషయంలో మేం స్వతంత్రులం. మా వినియోగదారులకు ప్రతి సేవనూ అందుబాటులో ఉంచుతాం. అన్ని కంపెనీల సర్వీసులు వారికి అందించడం లక్ష్యంగా మేం పనిచేస్తాం. అందులో ఏ సర్వీసు ను మార్కెట్‌నుంచి పొందాలో వినియోగదారే నిర్ణయించుకుంటారు" అని సింధియా వివరించారు.



# ట్రంప్‌తో పుతిన్ ఫోన్ కాల్

## - ఇరాన్ శాంతి ప్రతిపాదనపై కీలక చర్చ..

వాషింగ్టన్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు దౌత్య ప్రయత్నాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్ అభిప్రాయాలను, యుద్ధాన్ని పరిష్కరించేందుకు ఆ దేశం అనుసరించాలనుకుంటున్న మార్గాన్ని ట్రంప్‌నకు వివరించినట్లు క్రెమ్లిన్ తాజాగా వెల్లడించింది. అయితే, ఈ ప్రతిపాదనలపై ట్రంప్ ఎలా స్పందించారనే విషయాన్ని రష్యా వెల్లడించలేదు. శుక్రవారం జరిగిన ఫోన్ సంభాషణలో ఇరాన్‌కు సంబంధించిన అంశాలపై చర్చ జరిగినట్లు క్రెమ్లిన్ తెలిపింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అభిప్రాయాలను ట్రంప్ దృష్టికి పుతిన్ తీసుకెళ్లినట్లు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. అమెరికాతో కొనసాగుతున్న ఘర్షణకు పరిష్కారం కనుగొనే దిశగా ఇరాన్ అభిప్రాయాలను అమెరికా అధ్యక్షుడికి పుతిన్ తెలియశారని పేర్కొన్నారు. ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడటానికి ముందు పుతిన్ తుర్క్‌మెనిస్థాన్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో సమావేశమయ్యారు. పశ్చిమాసియాలో శాంతిని తిరిగి నెలకొల్పే దిశగా మధ్యవర్తిత్వం చేసేందుకు రష్యా ఆసక్తి చూపుతున్నట్లు పుతిన్ గతంలోనే సంకేతాలిచ్చారు.

తాజాగా ఆ దిశగా ముందడుగు వేశారు. అయితే పుతిన్ ప్రతిపాదనలకు ట్రంప్ స్పందన ఏంటనేది క్రెమ్లిన్ వెల్లడించలేదు. అలాగే, ఇరాన్ ప్రతిపాదనల్లో ఉన్న కీలక అంశాలు ఏమిటన్న దానిపైనా వివరాలు లేవు.

# రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంది

మొదటి పేజీ తరువాయి...

కానీ.. అదే రోజు ఏఐసీసీ ఢిల్లీలో నిరసన కార్యక్రమాన్ని చేపడుతోంది. దీనికి సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఎంపీలు, ఇతర కీలక నేతలంతా తరలి వెళ్లనున్నారు. ఫలితంగా, 12న నిర్వహించాల్సిన సమావేశం వాయిదా పడింది. అయినా, సీఎం రేవంత్ త్వరలోనే దానిని నిర్వహించనున్నారు. అదే రోజు 'పంటలు వేయొద్దు' అని రైతులకు సీఎం విజ్ఞప్తి చేయనున్నారు. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లోని రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ' 'ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో తాగడానికి నీళ్లు దొరకడం లేదు. కొందామన్నా విద్యుత్తు దొరకడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలు వేస్తే.. పరిస్థితులు మరీ దారుణంగా ఉండే ప్రమాదముంది. రబీ సీజన్‌లో పంటలకు నీరు అందకపోవచ్చు. రైతాంగం ఇప్పటికే ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొంటోంది. ఉన్న నీటిని కూడా పంటలకు వినియోగిస్తే తాగునీటికి చాలా సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుంది. మీరు పంటలు వేయకుండా ఉంటే.. ఉన్న నీటిని తాగునీటికి వినియోగిస్తాం. కావాల్సినన్ని రోజులు పని దినాలు కల్పిస్తాం. అదనపు రేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ... మీరు మాత్రం పంటలు వేయొద్దు" అని సీఎం రేవంత్ వివరించనున్నారు.

**కేంద్ర సహాయం కోసం విజ్ఞప్తి**

మంత్రులతో సమావేశాన్ని నిర్వహించే రోజే.. సహాయం కోసం కేంద్రానికి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేయనున్నారు. రాష్ట్రంలో రబీ పంటలను రైతులు సాగు చేయడం లేదని, ఈ దృష్ట్యా అన్ని రకాలుగా ఆదుకోవాలని కేంద్రాన్ని కోరనున్నారు. ముఖ్యంగా.. రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్తు సమస్య నెలకొంటున్నందున కామన్ పూల్ కింద రాష్ట్రానికి 1500 మెగావాట్ల విద్యుత్తును అందించాలని డిమాండ్ చేయనున్నారు. రబీ సీజన్‌లో రైతులు పంటలు వేసే అవకాశం లేనందున.. ఆ నష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలంటూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. పరిహారం కింద కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించేలా చూద్దామంటూ విజ్ఞప్తి చేయనున్నారు. ఇందుకోసం అఖిలపక్ష నేతలను ఢిల్లీకి తీసుకెళ్లే ఆలోచన ఉన్నట్లు సమాచారం.

**పంటల రక్షణకు గ్రామ కమిటీలు**

ప్రస్తుత ఖరీఫ్ పంటలను పరిరక్షించడానికి గ్రామ స్థాయిలో కమిటీలు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు సంఘాలు, స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులతో ఈ కమిటీలను వేస్తారు. ఖరీఫ్ పంటలు మరో రెండు నెలల్లో చేతికి రానున్నాయి. ఇప్పుడు నీటి ఆవశ్యకత చాలా ఉంది. అందుకే, ఉన్న నీటిని పొదుపుగా ఎలా వాడుకోవాలన్న దానిపై ఈ కమిటీలు గ్రామాల్లో సూచనలు, సలహాలు ఇస్తాయి. అదే రకంగా రాష్ట్రంలో మంత్రులు, ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీ రబీ పంటలను వేయకుండా రైతులకు సూచనలు చేస్తుంది.

**తక్షణ చర్యలకు ప్రణాళికలు ఇవ్వండి: సీఎం**

ఎల్‌నినో ప్రభావంతో అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్తు సమస్యల విషయంలో సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. "ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలి. రాబోయే 8 నెలలు కీలకం. ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలి. రాబోయే రోజుల్లో విద్యుత్తు సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం ఉంది. అవసరమైన విద్యుత్తు కొనుగోలుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేయడానికైనా సిద్ధంగా ఉంది. కానీ... మార్కెట్‌లో విద్యుత్తు అందుబాటులో లేదు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలి. విద్యుత్తు ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేయండి. ఎల్‌నినో ప్రభావంపై సినిమా, మీడియా, కళాజాతలతోపాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించండి" అని సూచించారు. ఖరీఫ్ పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రతరం కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు సీఎం తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. "రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నాయి. కరువు మండలాల ప్రకటనతోపాటు తగినంత ఆర్థిక సాయాన్ని అందించాల్సి ఉంది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని కేటాయించాలని కోరింది" అని గుర్తు చేశారు. వీబీజీ–రామ్‌జీ పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సీఎం సూచించారు. దసరా తర్వాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పరిస్థితులను సమీక్షించేందుకు వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రూ. 70 కోట్లతో అభివృద్ధి పనులు

మొదటి పేజీ తరువాయి...

నూతన బిటి రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు.హా ఇందులో రూ. 2.42 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుండి దానవాయిగూడెం (వయా మున్నేరు) వరకు, రూ. 2.20 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుండి రామునిపేట వరకు బీటీ రోడ్ల నిర్మాణాలు వున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ (200 యూనిట్లు), ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా అందిస్తున్నామన్నారు. పోలేపల్లి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాబోయే కొద్ది రోజుల్లోనే నూతన రేషన్ డీలర్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి అన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ స్కూల్‌లో స్థల సమస్య ఉన్నందున, సమీపంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నూతన స్కూల్ భవనాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలకు కట్టుబడి ఉన్నామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పిఆర్ ఈఈ మహేష్ బాబు, స్థానిక సర్పంచ్ బత్తిని మహేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గా నవరాత్రులకు పటిష్ట భద్రత

మొదటి పేజీ తరువాయి...

పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలు, రావణ దహనం జరిగే ప్రదేశాలు, ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మండపాల నిర్వాహకులకు పోలీసుల సూచనలు చేశారు. దుర్గాదేవి మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మండపాల వివరాలను నమోదు చేసుకుని పోలీసులకు సహకరించాలని ఎస్పీ సూచించారు. మండపాల ఏర్పాటు వల్ల ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండపాల భద్రత బాధ్యతను నిర్వాహకులు తీసుకోవా లన్నారు. మండపం వద్ద 24 గంటల పాటు నలుగురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేసి, వాలంటీర్లను నియమించాలి. మండపాల్లో, శోభాయాత్రల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మండపాల వద్ద సాంస్కృతిక, ఇతర కార్యక్రమాలు నిర్వహించే ముందు పోలీసులకు సమాచారం అందించాలి. మహిళలు, పిల్లలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. పోలీసు శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ దుర్గా నవరాత్రులు, దసరా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కోరారు.

# కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు స్వర్ణయుగం

మొదటి పేజీ తరువాయి...

విద్యారంగంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ పేద వర్గాలకు గురుకుల పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మన ఊరు – మన బడి ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చారని తెలిపారు.వైద్యరంగంలో జిల్లాకో మెడికల్ కాలేజ్,500 పడకల ఆసుపత్రులు, మాతా శిశు సంరక్షణ కేంద్రాలు,పల్లె,బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసి పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు.

పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు గతంలో ఉన్న 10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించారని, ఒకనాడు సాధారణ గ్రామ పంచాయతీగా ఉన్న పెద్దపల్లిని జిల్లా కేంద్రంగా మార్చడం కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ పూర్తిగా నిర్వీర్యమైపోయాయని కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యారంగం కుంటుపడిందని, గ్రామ పంచాయతీలకు నిధులు రాక పల్లెల్లో అభివృద్ధి ఆగిపోయిందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన రైతుభరోసా,కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, పెన్షన్ల పెంపు వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు గుర్తుచేస్తూ,ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికే ఈ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్,మార్కు లక్ష్మణ్,మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డి,మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్ రావు,మాజీ పీఏసీఎస్ చైర్మన్ సందీప్ రావు,కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్,సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు గుణపతి,సూర శ్యామ్,మాజీ ఏఎంసీ చైర్మన్ దయాకర్,సర్పంచులు భూమేష్, గొడుగుల సతీష్,బోయిని లావణ్య శ్రీనివాస్,సలేంద్ర రాములు,బాలసాని ఈశ్వర గౌడ్,గోపి,ములుగురు అంజయ్య,ప్రసడ్ల సంపత్,తీగల సదయ్య,కోయ్యడ విక్రం గౌడ్,పూదరి చంద్రశేఖర్,పెంచాల శ్రీధర్,కాశిపాక వాసు,పల్లె మధు,తదితరులు పాల్గొన్నారు.

# దసరాకి ఊరెళ్తున్నారా.. ఈ పనులు చేసి వెళ్లడం తప్పనిసరి: బాలానగర్ ఏసీపీ



కూకట్‌పల్లి : దసరా పండుగ కోసమని చాలా మంది ప్రజలు నగరాలు, పట్టణాలు విడిచి స్వగ్రామాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో తాళం వేసిన ఇండ్లే టార్గెట్ చేసి నగరంలో పలుచోట్ల చోరీలకు పాల్పడుతున్నారు. విలువైన వస్తువులు, నగదు దోచుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో పండగకు సొంతూర్లకు వెళ్లే ప్రజలకు బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి కొన్ని సూచనలు, జాగ్రత్తలు జారీ చేశారు. దొంగల బారిన పడకుండా వీటిని తప్పని సరిగా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు ఏసీపీ నరేష్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఊరికి వెళ్లినపుడు తప్పనిసరిగా సమీప పోలీస్ స్టేషన్లలో సమాచారం అందించాలని, దీని వల్ల పెట్రోలింగ్ పోలీసులు సంబంధిత నివాస గృహాలపై ప్రత్యేక నిఘా పెడుతారని స్పష్టం చేశారు. అలాగే ఇరుగు పొరుగుకు కూడా సమాచారం ఇవ్వాల ని, మీ ఇంటికి సంబంధించి ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే మీకు తెలియజేయాలని విజ్ఞప్తి చేయాలని సూచించారు. ఊరికి వెళ్లేటప్పుడు ఎక్కువ బంగారం, డబ్బు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలని, బీరువాలో విలువైన వస్తువులుంటే వాటి తాళాలు ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లాలని చెప్పారు. మీరు ఊరు వెళ్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, నేరగాళ్లు తెలుసుకుని, మీ ఇల్లు ఖాళీ చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇంట్లో లైట్లు వేసి ఉంచాలని, తాళం బయటికి కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలని, ఇంట్లో, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు, అందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనుమానితులపై నిఘా ఉంచాలని, అలాంటి వారి గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపైనా అలర్ట్‌గా ఉండాలని, పండగ పేరిట వచ్చే ఆన్‌లైన ఆఫర్ల లింకులతో మోసపోవద్దని, బ్లూ కలర్ లింకులు అస్సలు ఓపెన్ చేయవద్దని, లాటరీ తగిలిందని, తక్కువ ధరకు గిఫ్ట్ వచ్చిందని వచ్చే మెస్సేజ్‌ను నమ్మవద్దని హెచ్చరించారు. సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకున్నట్టయితే వెంటనే 1930కి ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అత్యవసర సహాయం కోసం జాతీయ హెల్ప్‌లైన్ 112, 100కు కాల్ చేయాలని, పోలీసులకు ప్రజలు సహకరించాలని, పండుగను ఆనందోత్సాహంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ నరేష్ రెడ్డి సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 10( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పిఎంశ్రీ జెడ్ పి హెచ్ ఎస్ ఇబ్రహీంపట్నం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మ్యాకల రాజన్న నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు. బతుకమ్మ సంబరాల ఇంచార్జ్ ఉపాధ్యాయురాలు. కటుకం కవిత. ఉపాధ్యాయ బృందం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతలను కటుకం కవిత. విద్యార్థులకు వివరించారు. పూలతో బతుకమ్మలను పేర్చి గౌరీదేవిని పూజించే ఈ పండుగ మహిళల ఐక్యతను తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## తూముల మరమ్మతుకు రూ.8.90 నిధులు మంజూరు

### రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు వెల్లడి



మెట్ పల్లి రూరల్, అక్టోబర్ 10:(ప్రజా కలం); జగిత్యాల జిల్లా మెట్లపల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలోని పెద్ద చెరువు తూములు, కాలువల మరమ్మతుల కోసం నీటిపారుదల శాఖ ద్వారా రూ.8.90 లక్షల నిధులు మంజూరైనట్లు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తెలిపారు.నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారీ, మధ్యతరహా నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ నలమడ ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ సరఫరా లేక నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి:

### - బెల్లంపల్లి బిఆర్ఎస్ నాయకులు



బెల్లంపల్లి, అక్టోబర్ 10, (ప్రజాఫలం) ప్రతినిధి మంచిర్యాల జిల్లా,బెల్లంపల్లి శివాలయం సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులు బైఠాయించి ఆందోళన చేపట్టారు.ఎండిపోతున్న పంటలను కాపాడాలని , నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అంతరాయం వల్ల వ్యవసాయానికి నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు రామగోని అశోక్ గౌడ్,బట్వన్ పల్లి సర్పంచ్ సింగతి రాజేష్ మాట్లాడుతూ గత 8 నెలలుగా ముందే ఎల్ నినో ప్రభావం ఉంటుందని తెలిసి కూడా ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్ల రెండు మూడు రోజుల విద్యుత్ అంతరాయం వల్ల నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు అన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సబ్ స్టేషన్ వద్ద రైతులు నిరసన చేశారు. కాగా డిఈ అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించుకున్నారు..

## నెట్‌బాల్ పోటీలకు రెజింగ్ సన్ విద్యార్థిని సహస్ర ఎంపిక

పెద్దపల్లి,అక్టోబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

స్థానిక రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థిని సహస్ర రాష్ట్రస్థాయి సబ్ జూనియర్




నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ తగురం తిరుపతి తెలిపారు. సెప్టెంబర్ 30న రైజింగ్ సన్ పాఠశాల ప్రాంగణంలో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో ఆమె అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించింది.కుమ్రం భీం ఆసిఫాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సహస్ర జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన సహస్రను పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు హకీమ్ ఖాన్ ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి పాఠశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే అంగన్‌వాడీలకు దసరా సెలవులు

### - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాకలం): తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు దసరా సెలవులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సాయి ఈశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు దసరా సెలవులు కల్పించాలని ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ నిరంతరం చేసిన పోరాటాలు, విజ్ఞప్తులు, ఉద్యమాల ఫలితంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తూ, వారి హక్కుల సాధనకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2026 అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజుల పాటు దసరా సెలవులు ప్రకటించారని, ఈ సమయంలో లబ్ధిదారులకు వేడి వంట భోజనానికి బదులుగా ఇంటికి తీసుకెళ్లే రేషన్ (టేక్ హోమ్ రేషన్) అందించాలని ఆదేశించినట్లు వివరించారు. అక్టోబర్ 22 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేస్తాయని తెలిపారు.అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్వాగతించదగినదని పేర్కొన్న సాయి ఈశ్వరి, ఉద్యోగుల ఇతర పెండింగ్ సమస్యలను కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ తన పోరాటాలను కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

## దుర్గాదేవి ఆగమనంతో యువతలో నయా జోష్

### అమ్మవారి స్వాగతానికి యువత వినూత్న ప్రయత్నాలు - భక్తి భావానికి ఆధునిక హంగులు




గొల్లపల్లి అక్టోబర్ 10 ప్రజాకలం ప్రతినిధి

దుర్గాదేవి ఆగమనం సందర్భంగా యువతలో కొత్త ట్రెండ్ మొదలైంది. అమ్మవారికి ఘన స్వాగతం పలికేందుకు యువత వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తున్నారు. సంప్రదాయ భక్తికి ఆధునికతను జోడిస్తూ, ప్రత్యేక అలంకరణలు, ఆకర్షణీయమైన స్వాగత ఏర్పాట్లు, డీజేలు,లైటింగ్,బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ వాతావరణాన్ని యువత మరింత ఉత్సాహభరితంగా మారుస్తున్నారు. దుర్గాదేవి ఆగమన వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ యువత తమ భక్తిని చాటుకుంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లో స్నేహితులంతా ఒక్కటై అమ్మవారి రాకను వేడుకగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. యువతలో ఐక్యతను పెంపొందించడంతో పాటు, పండుగల పట్ల ఆసక్తిని కూడా ఈ కార్యక్రమాలు పెంచుతున్నాయి. అయితే వేడుకల ఉత్సాహంలో సంప్రదాయాలు, క్రమశిక్షణ, ఇతరుల ఇబ్బందులను విస్మరించకూడదని పెద్దలు సూచిస్తున్నారు. శబ్ద కాలుష్యాన్ని నివారిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, పర్యావరణానికి హాని చేయకుండా వేడుకలను నిర్వహించాలి. భక్తి, ఐక్యత, సామాజిక బాధ్యత కలిసినప్పుడే పండుగలకు అసలైన స్ఫూర్తి ప్రతిబింబిస్తుందనీ సూచిస్తున్నారు. దుర్గాదేవి ఆగమనం పేరుతో యువత తీసుకొస్తున్న ఈ కొత్త ట్రెండ్ పండుగలకు కొత్త కళను తీసుకొస్తోంది. ఆధునికత ఎంత పెరిగినా, భక్తి తో పాటు బాధ్యత కూడా ముఖ్యమని భక్తి సంప్రదాయాలను కాపాడుతూ వేడుకలను సంతోషంగా నిర్వహించడమే నిజమైన ప్రత్యేకత

## ఎస్సారెస్పీ నీటి విడుదలకు ఎమ్మెల్యే కృషి అభినందనీయం

### బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒజ్జెల శ్రీనివాస్



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 10(ప్రజాకలం):

పొట్ట దశలో ఉన్న వరి పంటకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ చేసిన ప్రయత్నాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒజ్జెల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే సంజయ్ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేయగా, కోరుట్ల నియోజకవర్గంతో పాటు జగిత్యాల జిల్లాకు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వరి పంట కీలక దశలో ఉన్న సమయంలో నీటి విడుదలకు కృషి చేయడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని ఒజ్జెల శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతుల పక్షాన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు.శలో ఉన్న వరి పంటకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ చేసిన ప్రయత్నాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒజ్జెల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే సంజయ్ నీటిపా రుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేయగా, కోరుట్ల నియోజకవర్గంతో పాటు జగిత్యాల జిల్లాకు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వరి పంట కీలకదశలో ఉన్న సమయంలో నీటి విడుదలకు కృషి చేయడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని ఒజ్జెల శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతుల పక్షాన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు.

## ఇంద్రకీలాద్రి శ్రీ కనుక దుర్గమ్మకు చేనేత కళాసౌరభం

### - దుర్గామాతకు పద్మశాలీల చేనేత పట్టుచీరల కానుక



పెద్దపల్లి,అక్టోబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో పవిత్ర సేవా కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి నేతృత్వంలో,కనకదుర్గ దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు జి.వి. నాగేశ్వరరావు,శ్రీనివాసరావుల సమక్షంలో పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు బొద్దుల లక్ష్మణ్ ఆలయ సంప్రదాయాల ప్రకారం అమ్మవారికి చేనేత పట్టుచీరతో కూడిన సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు.నవరాత్రి ఉత్సవాల పది రోజుల కోసం పది ప్రత్యేక చేనేత పట్టుచీరలను కానుకగా అందజేయడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా బొద్దుల లక్ష్మణ్ మాట్లాడుతూ ముల్లోకాలను రక్షించే జగజ్జనని శ్రీ కనకదుర్గమ్మ సేవలో పాల్గొని చేనేత వస్త్రాలు సమర్పించడం పూర్వజన్మ సుకృతమని,తెలుగు రాష్ట్రాల ప్రజలందరూ ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు వెల్లడించారు.అనంతరం ఆలయ అధికారులు,అర్చకులు సంఘ ప్రతినిధులకు అమ్మవారి దర్శనం కల్పించి,వేద ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కళాకారులు,సంఘ ప్రముఖులు గడ్డం జగన్నాథం,వనం విశ్వనాథం,దుశ్యంతల బొళ్ళ శివశంకర్,రాపోలు సుధాకర్, మెతుకు సత్యం,గుర్రం శ్రావణ్ కుమార్,గుంటక రూప,పోరండ్ల శారద,నోముల రేఖ,చిన్నకోట్ల స్వప్న,గుర్రం విశ్వేశ్వరరావు,కర్ణాటి విజయ్,కైరంకొండ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

### రక్తదానం చేయండి ప్రాణదాతలు గా నిలవండి: బిజెపి జిల్లా మహిళా మోర్చా పాలసీ రీసెర్చ్ కో కన్వీనర్:నల్లుల సంగీత



బెల్లంపల్లి : బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శనివారం పట్టణంలోని తాపీ సంఘం భవనంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. దాతలు పెద్ద ఎత్తున వచ్చి రక్తదానం చేశారు.. దాతలకు మోడీ క్యాంటీన్ ద్వారా అల్పాహారం పంపిణీ చేశారు. దాతలకు అభినందన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా మహిళా మోర్చా రీసెర్చ్ కో కన్వీనర్ నల్లుల సంగీత మాట్లాడుతూ తల సేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ఎప్పుడు రక్తం అవసరం ఉంటుందని, ఇలాంటి రక్తదాన శిబిరాల ద్వారా రక్తం సేకరించి అవసరం ఉన్నవారికి అందించడమే లక్ష్యంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు.. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన దాతలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు....

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓట్ల రద్దు సరికాదు

### - బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్




బెల్లంపల్లి, అక్టోబర్ 10, (ప్రజాకలం) ప్రతినిధి ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు బాధ్యత వహిస్తూ సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని బెల్లంపల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ , జిల్లా అధ్యక్షులు, పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. బిజెపి ఓటు చోరికి పాల్పడుతూ గద్దలెక్కుతుందని,ఓటు రద్దు అయిన వారికి తమ సహాయ సహకారాలు ఉంటాయి అన్నారు.. ఇట్టి విషయం పై తమను ప్రజలు సంప్రదించాలని కోరారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అభివృద్ధిలో ముందుకు ఇసుకపోతుందన్నారు. ఇందిరమ్మండ్లు, మహిళలకు ఫ్రీ బస్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, వంటి అనేక సంక్షేపం పథకాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ రాణిస్తుందని రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే దిశగా ప్రతి ఒక్క నాయకుడు,కార్యకర్త పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, సీనియర్ నాయకులు చిలుముల శంకర్ , గెల్లి రాజలింగు, చిన్న రాజం, నెల్లి రమేష్,కౌన్సిలర్స్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాకలం) తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణంలోని గోల్ హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు పట్టూరి తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలు, కోలాటాలతో సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టూరి తిరుపతి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలందరూ ఐక్యంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గోల్ హనుమాన్ ఆలయ పరిసర ప్రాంతాల మహిళలు పాల్గొన్నారు.

## మెట్ పల్లిలో పెన్షన్ దరఖాస్తుల పరిశీలన

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజా కలం) మున్సిపాలిటీ పరిధిలో నూతన పెన్షన్ దరఖాస్తుల పరిశీలనలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. డీఆర్‌డీఓ ఏ. రఘువరన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వారి వివరాలు, అర్హతలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించేలా తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, క్షేత్రస్థాయి పరిశీలన అధికారులు పాల్గొని దరఖాస్తుదారుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు డి. శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.




ప్రజా కలం
ఆదివారం, అక్టోబర్ 11, 2026

# సూపర్ డూపర్ ఎలినినో

పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన ఎల్ నినో క్రమంగా తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే దీని ప్రభావంతో భారత్ సహా దక్షిణాసియాలో నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఇది మరింత తీవ్రస్థాయికి చేరుకుంటుందని ఇటీవల ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. తాజాగా, అంతర్జాతీయ వాతావరణ నిపుణులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ.. సూపర్ ఎల్ నినో దెబ్బకు భూగోళం మొత్తం ఎరుపుగా మారిపోయిందని మ్యాప్‌ను షేర్ చేశారు.గతంలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయికి చేరుకుంటోన్న ఎల్ నినో ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1950 తర్వాత నమోదుకాబోతున్న అత్యంత బలమైన వాతావరణ పరిణామాలలో ఇది ఒకటి కావచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పుల తీవ్రతను ఈ ఎల్ నినో మరింత పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రం అంతర్భాగంలో దాగివున్న అధిక ఉష్ణోగ్రతలను బయటకు విడుదల చేయడం వల్ల భూగోళంలో అత్యధిక భాగం అసాధారణమైన వేడిని ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.రియాన్ మౌ అనే అంతర్జాతీయ వాతావరణ నిపుణుడు మొత్తం భూగోళానికి సంబంధించిన క్లైమేట్ మ్యాప్‌ను సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో పంచుకుంటూ... భూగోళం అంతా దాదాపుగా ఎరుపు రంగులోకి (తీవ్రమైన వేడికి సూచికగా) మారిపోయిందని పేర్కొన్నారు. "అమెరికా మినహా మిగిలిన ప్రపంచమంతటా ఉష్ణోగ్రతలను విపరీతంగా పెంచుతూ ఈ ఎల్ నినో శీతాకాలంలో కూడా తన 'గరిష్ట ప్రతాపాన్ని' చూపిస్తోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఎల్ నినో తీవ్రత వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్న చిట్కా అంచనాతో ఆయన కూడా ఏకీభవించారు.మరో శాస్త్రవేత్త జేకే హాస్‌ఫాథర్ స్పందిస్తూ... "ఈ ఏడాది ఎల్ నినో రికార్డులను తిరగరాస్తూ కొత్త గరిష్టాలకు చేరుకుంటోంది.. నినో 3.4 ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి. ఇది ఇప్పటివరకు నమోదైన ఏ ఇతర ఎల్ నినో పరిణామం కంటే కూడా అత్యధికం" అని పేర్కొన్నారు. లియోన్ సిమన్స్ అనే మరో నిపుణుడు ఈ పరిణామాన్ని 'సూపర్-డూపర్ ఎల్ నినో' గా అభివర్ణించారు.ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 చివరి నెలల్లో ప్రపంచంలోని ఎక్కువ భాగంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఎల్ నినో పుట్టకకు కేంద్రమైన మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7 డిగ్రీల సెల్సియస్ (6.7 డిగ్రీల ఫారెన్‌హీట్) ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు.సాధారణంగా ఎల్ నినో అనేది సహజంగా సంభవించే 'ఎల్ నినో-సౌత్ ఐసోలేషన్' చక్రంలో భాగమైన ఒక వేడి దశ. ఇది ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఈ వాతావరణ మార్పుల వల్ల ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, వర్షపాత వ్యవస్థలు దెబ్బతింటాయి. దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరువు కాటకాలు, మరికొన్ని ప్రాంతాల్లో తుఫానులు, భారీ వర్షాలు సంభవిస్తాయి.ఈ అసాధారణ పరిస్థితుల వల్ల ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తీవ్రమైన ఈదురుగాలులు, తీరప్రాంత వరదలు, బీచ్ కోత ప్రమాదాలు చాలా ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించిన కాలిఫోర్నియా గవర్నర్ గెవిన్ న్యూసమ్, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, శీతాకాలపు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గత నెలలోనే రాష్ట్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.సమీప కాలంలో ద్రవ్యోల్బణంపై సరఫరా వైపు నుంచి ఒత్తిళ్లు కొనసాగొచ్చని ఆర్బీఐ తెలిపింది. బలహీనమైన నైరుతి రుతుపవనాలు, ఎల్ నినో పరిస్థితులు, అంతర్జాతీయ చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు దీనికి కారణమవుతాయని పేర్కొంది. చమురును మినహాయిస్తే ఆహార విభాగంలోని పలు కమోడిటీల ధరల్లో కూడా ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది. కోర్ ద్రవ్యోల్బణం పెరగడం, సీపీఐ బాస్కెట్‌లోని మరిన్ని వస్తువుల ధరలు పెరగడం చూస్తే ద్రవ్యోల్బణం ఒకటి రెండు వస్తువులకు పరిమితం కాకుండా విస్తృతంగా మారే తొలి సంకేతాలు కనిపిస్తున్నాయని ఆర్బీఐ తెలిపింది. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని 2026-27లో సీపీఐ ద్రవ్యోల్బణం 5.2 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. రెండో త్రైమాసికంలో 4.9 శాతం, మూడో త్రైమాసికంలో 6.0 శాతం, నాలుగో త్రైమాసికంలో 5.7 శాతంగా ఉండొచ్చని తెలిపింది. 2027-28 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.6 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. దీనికి సంబంధించిన రిస్కులు కూడా ఇరువైపులా సమానంగా ఉన్నాయని పేర్కొంది. 2026-27 మొత్తం సంవత్సరానికి కోర్ ద్రవ్యోల్బణం 4.4 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసింది.అమెరికాలోని ఆరు రాష్ట్రాలు ఈ శీతాకాలంలో అత్యంత తీవ్రమైన వర్షపాతం, భారీ హిమపాతాన్ని ఎదుర్కోనున్నాయి. కాలిఫోర్నియాతో పాటు నెవాడా, ఉతా, కొలరాడో, న్యూ మెక్సికో, అరిజోనా రాష్ట్రాలపై ఈ ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ రాష్ట్రాల్లోని పర్వత ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాల్లో సగటు కంటే చాలా ఎక్కువగా హిమపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ పరిశోధకులు గత నెలలో వెలువరించిన వివరాల ప్రకారం... ఈ ఏడాది వచ్చిన ఈ 'సూపర్-ఎల్ నినో' కారణంగా జూన్ నుంచి ఫిబ్రవరి 2027 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 4,51,000 మందికి పైగా మరణించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# సాగునీరు..విద్యుత్ ఇవ్వకుంటే పోరాటం ఉధృతం

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ - ఎలిగేడు సబ్‌స్టేషన్ వద్ద రైతులతో కలిసి బీఆర్ఎస్ నిరసన



పెద్దపల్లి,అక్టోబర్10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి): ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలు చేతికి వచ్చే దశలో సాగునీరు అందక, విద్యుత్ కోతలతో ఎండిపోతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర వీడకపోవడం దారుణమని, వెంటనే ఎస్సారెస్పీ కాల్వలకు నీటిని విడుదల చేసి నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయకుంటే రైతాంగంతో కలిసి పోరాటం ఉధృతం చేస్తాం అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. శనివారం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిర్వహించిన మహాధర్నా, ముట్టడి కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ,సాగునీరు, విద్యుత్ సమస్యలతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు అప్పులు చేసి,పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోందని మండిపడ్డారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించామని,ప్రస్తుత పాలనలో ఎందుకు విద్యుత్ కోతలు విధిస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. విద్యుత్ సరఫరా సమృద్ధిగా ఉందని అధికారులు కాగితాల్లో ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి దయనీయంగా మారిందని విమర్శించారు.ఎలిగేడు పరిసర ప్రాంతాల్లో పగటిపూట నిరంతర విద్యుత్ ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారని,కానీ తాము సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సమయంలోనే రెండుసార్లు విద్యుత్ ట్రిప్ కావడమే ఇక్కడి సరఫరా లోపానికి ప్రత్యక్ష నిదర్శనమని ఎద్దేవా చేశారు.తరచూ ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయాల వల్ల లో-వోల్టేజీ సమస్య తలెత్తి బోరు మోటార్లు,ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని,దీంతో రైతులపై వేల రూపాయల అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎస్సారెస్పీ కాల్వలకు నీరు విడుదల కాకపోవడంతో కాల్వల ఆయకట్టు రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని,బోర్లపై ఆధారపడిన రైతులు విద్యుత్ కోతలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు.వెంటనే యుద్ధప్రాతిపదికన వారం రోజుల్లోగా ఎస్సారెస్పీ కాల్వలకు నీటిని విడుదల చేయాలని,వ్యవసాయానికి నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే బాగుచేయాలని,రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయడంతో పాటు ఎరువుల సరఫరా,పంటల కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

నీటి ఎద్దడి,విద్యుత్ సమస్యల వల్ల నష్టపోయిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి బాధితులకు తగిన పరిహారం అందించాలన్నారు.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని,రైతు సంక్షేమాన్ని విస్మరిస్తే అన్నదాతల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు.అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్,పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ మాట్లాడుతూ రైతులకు రోజుకు కనీసం ఆరు గంటలపాటు కూడా నిరంతర నాణ్యమైన విద్యుత్ అందకపోవడంతో డీజిల్ జనరేటర్ల కోసం వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.కాల్వల ద్వారా సాగునీరు పారించి, విద్యుత్ కోతలను ఎత్తివేసి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ మహాధర్నా,ముట్టడి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి-మోహన్ రావు,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి,సుల్తాన్‌పూర్ సర్పంచ్ బాపయ్య,ఉపసర్పంచ్ రమేష్ రావు,పార్టీ ముఖ్య నాయకులు బద్దం తిరుపతిరెడ్డి,పోషాలు, రాజేశం,వినోద్, సంపత్ ,నారాయణ, సాయినాథ్,సది,కార్తీక్,బేత్ కుమార్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పాత నేతల పెత్తనానికి కాలం చెల్లింది

## పెద్దపల్లిలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం - బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి



పెద్దపల్లి,అక్టోబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లి గడ్డపై భారతీయ జనతా పార్టీ జెండా ఎగరడం ఖాయమని,ఒకవేళ ఇక్కడ బీజేపీ గెలవకపోతే తాను గుండు కొట్టించుకుని తిరుగుతానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి శపథం చేశారు.శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘ ప్రజాసేవ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని కొనియాడారు. పెద్దపల్లి,రామగుండం, వరంగల్,హైదరాబాద్ వంటి ప్రధాన రైల్వే స్టేషన్లను విమానాశ్రయాలను తలపించేలా కోట్లాది రూపాయలతో ఆధునీకరించడంతో పాటు దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక మెడికల్ కాలేజీలు,మౌలిక వసతులు కల్పించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు.ఇదే క్రమంలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ ఎమ్మెల్యేకు కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు.ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చనిపోయిన వారి పేర్లు,డబుల్ ఓట్లను తొలగిస్తుంటే కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక అవాస్తవాలతో రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.గతంలో కాంగ్రెస్,టీడీపీ, బీఆర్ఎస్ పాలనలను చూసిన ప్రజలు ప్రస్తుతం రాష్ట్రంలో మార్పును బలంగా కోరుకుంటున్నారని తెలిపారు.పెద్దపల్లిలో పాత తరం నాయకుల పెత్తనానికి కాలం చెల్లిందని,యువతరం నాయకత్వంలో ఈసారి ఈ ప్రాంతాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.కిరాణా దుకాణాలు, కూరగాయల మార్కెట్లు ఎక్కడ చూసినా ప్రజలు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని,పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా అంతా కలిసికట్టుగా కమలం గుర్తును గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యువమోర్చా,ఎస్టీ మోర్చా నాయకులు అరుణ్,రాంరాజ్,శివం గారి సతీష్,బెజ్జంకి దిలీప్ తదితర పార్టీ ముఖ్య నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

## సీపీఎం ఎటపాక మండల కమిటీ డిమాండ్



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, అక్టోబర్ 10

పోలవరం జిల్లా, ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామంలో సీపీఎం పార్టీ ఎటపాక మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఆయనను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి., మండల కమిటీ సభ్యులు సవలం రాము, పూనెం వెంకటరావు, స్థానిక పార్టీ నాయకులు ముత్తయ్య, ఇర్మయ్య, ఏలియా, రాము, కట్టం చిన్నక్క, కంగాల రావమ్మ, సవలం చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం

## మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటల్లో పాల్గొన్న నగర మేయర్ జి. మమత



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 10:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు మహబూబ్‌నగర్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాన్ని మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, మైదానంలో వాటిని ఏర్పాటు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సంబరాలు చేసుకున్నారు. మహిళల ఆటపాటలతో కళాశాల మైదానం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

నగర మేయర్ జి. మమత మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటల్లో పాల్గొని ఉత్సాహపరిచారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం బ్రహ్మశ్రీ శ్రవణ్‌కుమార్ శర్మ బతుకమ్మ మహత్యాన్ని వివరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, మహిళా కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళలు, చిన్నారులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు ప్రతీక బతుకమ్మ

## - ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్

## - ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



సుల్తానాబాద్,సెప్టెంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ విశిష్ట సంస్కృతి,ప్రకృతి ఆరాధనకు ప్రతీకైన బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెబుతుందని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ పేర్కొన్నారు.పట్టణంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ పూలతో గౌరమ్మను కొలిచి ప్రకృతిని ఆరాధించడం మన సంస్కృతిలోని ప్రత్యేకత అని,విద్యార్థులు చిన్ననాటి నుంచే ఈ గొప్ప సంప్రదాయాలను అలవరచుకుని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,లయబద్ధమైన ఆటపాటలతో ప్రాంగణమంతా సందడి చేయగా పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ వేడుకల్లో వైస్ ప్రిన్సిపల్ సునీతతో పాటు ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సుగమ మార్గం

## - నూతన ఫ్లోరింగ్ పనులు పూర్తి

పెద్దపల్లి,అక్టోబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగుల రవాణాను సులభతరం చేసేందుకు చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యాయి. ఆసుపత్రి ప్రాంగణంలోని సీఓటీ విభాగం నుండి టీ-హబ్ ఎక్స్-రే విభాగానికి వెళ్లే మార్గంలో సిసి రోడ్డు తరహా పటిష్టమైన ఫ్లోరింగ్‌ను మెడికల్ సూపరింటెండెంట్ ప్రత్యేక చొరవతో నిర్మింపజేశారు.గతంలో ఈ మార్గంలో ఫ్లోరింగ్ సరిగ్గా లేకపోవడంతో రోగులను ఎక్స్-రే నిమిత్తం వీల్‌చైర్లు,స్ట్రెచర్లపై తీసుకెళ్లే సమయంలో ఆసుపత్రి సిబ్బంది,రోగుల సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.ముఖ్యంగా అత్యవసర సమయాల్లో రోగుల తరలింపు కష్టతరంగా మారేది.ఈ సమస్యను గుర్తించిన మెడికల్ సూపరింటెండెంట్ మానవీయ కోణంలో తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించారు.నూతనంగా నిర్మించిన ఈ మార్గం ద్వారా ఇకపై ఎటువంటి జాప్యం లేకుండా రోగులను వేగంగా,సురక్షితంగా ఎక్స్-రే విభాగానికి తరలించే వీలు ఏర్పడింది.ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగుల సౌకర్యార్థమే తమ మొదటి ప్రాధాన్యతని, భవిష్యత్తులోనూ రోగుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.



# మౌలిక వసతులు కల్పిస్తాం..

## భవన నిర్మాణాలు పూర్తి చేస్తాం

## వైద్య కళాశాలను సందర్శించిన మంత్రి అడ్లూరి




జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాకలం)

జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలను సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులతో సమావేశమై కళాశాలలో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల కొరత, భవన నిర్మాణ పనుల జాప్యంపై చర్చించారు. కళాశాలలో రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తుండటంతో ఎదురవుతున్న ఇబ్బందులను విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అవసరమైన మౌలిక వసతులు లేకపోవడంతో విద్యాభ్యాసానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు.విద్యార్థుల సమస్యలపై స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తవుతున్నాయని తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి హామీపై వైద్య విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల

ఎండపల్లి, అక్టోబర్ 10 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన బీజేపి పార్టీ మండల అధ్యక్షులు రావు హన్మంత రావు తండ్రి నారాయణ రావు ఇటీవలే మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నారాయణ రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఆయన, హన్మంత రావు తో పాటు వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయం లో కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఇదే గ్రామానికి చెందిన కొప్పుల రాజశేఖర్ ఇటీవల ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అంబారిపేట గ్రామానికి చెందిన వెయిగండ్ల శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. ఈ పరామర్శ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## నేడు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో
# జూనియర్స్ ఖో-ఖో జట్టు ఎంపికలు

**అర్హులైన బాలబాలికలు ఆధార్, బోనఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలి**

**జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సామ రమేష్**

నాగర్ కర్నూల్ అక్టోబర్ 10 (ప్రజా కలం): నాగర్ కర్నూల్ జిల్లా జూనియర్స్ బాలబాలికల ఖో-ఖో జిల్లా జట్టు ఎంపికలను ఆదివారం నాడు నిర్వహించనున్నట్లు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సామ రమేష్ తెలిపారు. జిల్లా



ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో అసోసియేషన్ అధ్యక్షుడు శీర్ణం నిరంజన్ యాదవ్ అధ్యక్షతన ఈ ఎంపికలు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 15 నుంచి 17వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని ఖో-ఖో మైదానంలో నిర్వహించనున్న 45వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ అంతర్‌జిల్లాల ఖో-ఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అర్హతలు, ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఎంపికల్లో చేయించాలని అదేవిధంగా ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు 2009 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని నిర్వాహకులు సూచించారు. క్రీడాకారులు తమ వెంట ఒరిజినల్ ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన క్రీడాకారులు మాత్రమే ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు.మరిన్ని వివరాల కోసం కృష్ణ, రవికుమార్, యాదయ్యలను వివరాలకు 9133148136, 9492174261, 9100607060 నంబర్లను సంప్రదించవచ్చని అయన తెలిపారు.

## ఖమ్మం హాస్పిటల్ లో కల్లూరు విలేకరి ను, తుమ్మలపల్లి వెంకటయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే రాఘమయి దయానంద్



తల్లాడ. అక్టోబర్. 11 ప్రజా కలం న్యూస్ సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాఘమయి దయానంద్ శనివారం ఖమ్మంలో అనారోగ్య కారణంగా చికిత్స పొందుతున్న కల్లూరు విలేఖరి ను మరియు అన్నారుగూడెం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి వెంకటయ్యను పరామర్శించారులి అనంతరం ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, కల్లూరు మండలం నాయకులు పసుమర్తి చందర్రావు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా 25వ శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

మల్లాపూర్, అక్టోబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి )

మల్లాపూర్ మండలంలోని కొత్త దాంరాజ్‌పల్లి గ్రామంలో శ్రీ దుర్గదేవి సేవా సమితి ఆధ్వర్యంలో అక్టోబర్ 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాన్ని శనివారం సర్పంచ్ ఏగ్యారపు లింబాద్రి, ఉపసర్పంచ్ బద్దం హరీష్ రెడ్డి, దుర్గాదేవి సేవ సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు సమక్షంలో ఆవిష్కరించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అక్టోబర్ 11న గ్రామ పొలిమేర నుండి నవదుర్గ దేవి మండపం వరకు ఊరేగింపు, 13న కుంకుమ పూజ, 14న చండీ హోమం,15న బోనాలు ఊరేగింపు, 16వ దీపారాధన, 17న మహా అన్నదానం, 18న పల్లకి నిర్వహించనున్నారు. అక్టోబర్ 20న ఉదయం 9 గంటలకు గ్రామ బస్ స్టాండ్ వద్ద మహిషాసుర సంహారం ఘట్టం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని శ్రీ నవదుర్గ సేవా సమితి సభ్యులు కోరారు.

## రంపచోడవరం నియోజకవర్గ ఎన్నికల ఆర్డినేషన్ కమిటీలో కొమ్ము వెంకటేష్‌కు అవకాశం

### జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: కొమ్ము వెంకటేష్

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, అక్టోబర్ 10: పోలవరం జిల్లా రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల ఆర్డినేషన్ కమిటీలో ఎటపాక



మండలానికి చెందిన జనసేన నాయకుడు కొమ్ము వెంకటేష్‌కు అవకాశం కల్పిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేరు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కొమ్ము వెంకటేష్ హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎటపాక మండలంలో జనసేన పార్టీ పోటీ చేసే ప్రతి స్థానంలో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. మండలంలోని జనసేన నాయకులు, జనసైనికులు, పార్టీ కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే ధ్యేయంగా పనిచేస్తూ, నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కృషి చేస్తానని కొమ్ము వెంకటేష్ స్పష్టం చేశారు.

# 22/ఏ భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**అర్హులైన రైతులకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

**కోలూర్, హంగిర్గ, హిప్నెల్లి గ్రామసభల్లో పట్టాదారులకు భరోసా**

**ప్రధాన, వ్యవసాయ రహదారుల అభివృద్ధికి హామీ**



తానూర్, అక్టోబర్ 10 (ప్రజా కలం): నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భరోసా ఇచ్చారు. భూ సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల్లో ప్రధాన రహదారులు, పొలాలకు వెళ్లే బాటల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. తానూర్ మండలంలోని కోలూర్, హంగిర్గ, హిప్నెల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టాదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసైన్డ్/ప్రభుత్వ భూముల చట్టంలోని 22/ఏ నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇటీవల నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో తానూర్ మండలానికి చెందిన సుమారు 2,500 ఎకరాల భూములకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. రైతుల ఇబ్బందులను వివరించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. భూములకు సంబంధించిన పట్టా పత్రాలు, పాత రెవెన్యూ రికార్డులు, ఇతర ఆధారాలను రైతులు సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. అధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, భూముల వివరాలను ధ్రువీకరించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన పట్టాదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు కూడా తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించి విచారణకు సహకరించాలని కోరారు.గ్రామాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రధాన రహదారుల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 27వ ప్యాకేజీ కింద చేపట్టే పనులు పూర్తయితే తానూర్ మండలంలోని గ్రామాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సరైన దారులు లేక ఇబ్బందులు పడకుండా ఉపాధి హామీ / ఉపాధి పథకాల కింద వ్యవసాయ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. పంటల రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామీణ రహదారులను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తామని చెప్పారు. గ్రామసభలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడతాయని, భూ సమస్యలు, రహదారుల నిర్మాణం, వ్యవసాయ అవసరాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు రైతుల భూ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, సంబంధిత రెవెన్యూ అధికారులు, మండల సీనియర్ నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కల్లు ధరల పెంపుపై గ్రామస్తుల ఆగ్రహం

**- దుకాణాలకు తాళాలు వేసి నిరసన..**

**- ధరలు తగ్గించకుంటే తెరవనివ్వబోమని హెచ్చరిక**

**- పాలెం గ్రామంలో కల్లు ధరల పెంపుపై వివాదం**



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 10 (ప్రజా కలం ): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో కల్లు ధరల పెంపుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారంటూ కల్లు దుకాణాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ధరలను తగ్గించే వరకు దుకాణాలను తెరవడానికి అనుమతించబోమని హెచ్చరించారు. గతంలో రూ.10 ఉన్న కల్లు సీసా ధరను గత ఏడాది రూ.13కు పెంచగా, తాజాగా మరోసారి రూ.15కు పెంచడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ధరలు పెంచితే సామాన్యులు ఎలా భరించాలని ప్రశ్నించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్నామని, కల్లు ధరల పెంపుతో కూలీలు, రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లగా, వారు కల్లు దుకాణదారులతో మాట్లాడి ధరలు తగ్గించాలని సూచించారు. అయినప్పటికీ ధరల విషయంలో అసంతృప్తి కొనసాగడంతో గ్రామస్తులు దుకాణాలకు తాళాలు వేసి నిరసనకు దిగారు. అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు కల్లు ధరల పెంపుపై సంబంధిత అధికారులు స్పందించి, ధరల నిర్ణయంపై విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ధరలు తగ్గించకపోతే దుకాణాలను తెరవనివ్వబోమని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తమ నిరసన కొనసాగిస్తామని తెలిపారు. ఈ నిరసనలో గ్రామ పెద్దలు నాగయ్య, దశరథం, బోనాసి కుర్మయ్య, మల్లికార్జున్, ఆర్మీ వెంకటయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## సీడీఓలు, టెక్ టీమ్ రైటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

నిర్మల్ అక్టోబర్ 10 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఐ పి ఎస్ జారీ చేసిన ఆదేశాలు, సూచనలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంపై నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడం, నాణ్యమైన దర్యాప్తు చేపట్టడం, కోర్టు విచారణలను వేగవంతం చేయడం, నేరాల్లో దోషులకు శిక్షలు పడేలా సమన్వయంతో పనిచేయడంపై పలు సూచనలు చేశారు.

**దర్యాప్తును పకడ్బందీగా పూర్తి చేయాలి**


ప్రతి కేసులో ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు వరకు దర్యాప్తును నాణ్యతతో పూర్తి చేయాలి. కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను సేకరించి, కోర్టులో సమర్థవంతంగా ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలి. దర్యాప్తులో నిర్లక్ష్యం, జాప్యం లేకుండా ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

**పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి**

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి. విచారణ ప్రారంభం కాని కేసుల ట్రయల్స్ త్వరగా మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఎస్ పి టి కేసులు, పెండింగ్‌లో ఉన్న ఈ-సమ్మన్లు, చిన్నచిన్న కేసులు, మద్యం సేవించి వాహనాలు నడిపిన (డి అండ్ డి) కేసులను త్వరగా పరిష్కరించాలి. దర్యాప్తు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నేరస్తులకు శిక్షలు పడే శాతం పెంచేందుకు కృషి చేయాలి.

**సిసిటిఎన్ఎస్‌లో కేసుల వివరాలు సకాలంలో నమోదు చేయాలి**

కేసులు, కోర్టు విచారణలకు సంబంధించిన




వివరాలను ఆన్‌లైన్‌లో, సి టి ఎన్ ఎస్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. కోర్టు ప్రక్రియల్లో అవసరమైన సి సి నంబర్లను త్వరగా పొందేలా చర్యలు చేపట్టాలి. ప్రతి కేసులో బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు చొరవ తీసుకోవాలి.

**విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

నేరాల నియంత్రణ, నాణ్యమైన దర్యాప్తు, కేసుల త్వరిత పరిష్కారం, ప్రజల భద్రత విషయంలో ప్రతి పోలీసు అధికారి బాధ్యతతో పనిచేయాలి. పోలీసులు సాధించిన విజయాలు, చేపట్టిన మంచి పనులను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పోలీసు శాఖపై నమ్మకాన్ని మరింత పెంచాలని ఎస్పీ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖైసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, సీసీటీఎన్ఎస్ రైటర్లు, టెక్ టీమ్, సీడీఓలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

### - సీపీఎం ఎటపాక మండల కమిటీ డిమాండ్



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, అక్టోబర్ 10 పోలవరం జిల్లా, ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామంలో సీపీఎం పార్టీ ఎటపాక మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఆయనను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి., మండల కమిటీ సభ్యులు సవలం రాము, పూనెం వెంకటరావు, స్థానిక పార్టీ నాయకులు ముత్తయ్య, ఇర్మయ్య, ఏలియా, రాము, కట్టం చిన్నక్క, కంగాల రావమ్మ, సవలం చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.

## సాగుకు నీటి విడుదల పట్ల హర్షం

### తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాకలం) తెలంగాణ రైతు ఐక్యవేదిక చేసిన విజ్ఞప్తి మేరకు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా వ్యవసాయ పంటలకు సాగునీరు విడుదల చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం పట్ల తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ పంటలకు చివరి దశలో



సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొనడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ కెనాల్ ద్వారా వ్యవసాయ పంటలకు సాగునీరు విడుదల చేయాలని సంబంధిత ఎస్ ఆర్ ఎస్ పి ఇరిగేషన్ అధికారులకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలను జారీ చేయడంతో ఆయకట్టు రైతాంగంలో ఆనందోత్సవాలు వెలువేరుస్తున్నాయనీ తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి పేర్కొన్నారు.

## ఐకెపి కార్యాలయంకు తీసిన గుంతలను తక్షణమే పూడ్చాలి

### తల్లాడలో ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్..



తల్లాడ అక్టోబర్ 10 (ప్రజా కలం న్యూస్ ):

తల్లాడలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పక్కన ఐకెపి కార్యాలయంకు సంబంధించిన భవనాన్ని నిర్మించేందుకు గుంతలను తీశారని, వాటిని తక్షణమే పూడ్చాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కోరు కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వరావు మాదిగ, జాతీయ నాయకులు ఇశ్నేపల్లి అశోక్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు దారెల్లి వెంకటేశ్వరావు మాదిగ డిమాండ్ చేశారు. శనివారం వారు కార్యాలయం నిర్మాణానికి సంబంధించిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ పక్కన ఐకెపి కార్యాలయం ఏర్పాటు చేయటం వల్ల కార్యాలయానికి వచ్చేవారికి ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. అంబేద్కర్ భవన్ పక్కన చిన్న స్థలంలో మరో కార్యాలయం ఎలా పడుతుందని వారు ప్రశ్నించారు. అంబేద్కర్ భవన్లోనికి పోవాలంటే ఎలా వెళ్తారని అన్నారు. వెంటనే అంబేద్కర్ భవనం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి గేటు ఏర్పాటు చేయాలని సూచించారు. తక్షణమే గుంతలనుపూడ్చి యధావిధిగా ఉంచాలని, లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షల చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు మాదిగ, ఇస్నపల్లి వీరయ్య మాదిగ, దేవా తదితరులు పాల్గొన్నారు.

## అమరవాయిలో 14న మహిళా సమాఖ్య భవనం ప్రారంభం!

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 10 (ప్రజా కలం):జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం డి. అమరవాయి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద రూ.10 లక్షల నిధులతో నిర్మించిన నూతన మహిళా సమాఖ్య భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో నిర్మించిన ఈ భవనాన్ని ఈ నెల 14న ప్రారంభించనున్నట్లు




మాజీ ఎంపీటీసీ పెద్ద గోపాల్ రెడ్డి, సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సంఘాల సమావేశాలు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళలు ఐక్యంగా ముందుకు సాగేందుకు, వారి అభివృద్ధికి ఈ భవనం దోహదపడుతుందని తెలిపారు.భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 14న నిర్వహించనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఈ నెల 12న రైతులతో సీఎం ముఖాముఖి!

### ఎల్‌నినో ప్రభావంతో తగ్గిన వర్షాలు.. పంటల పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్స్

జోగులాంబ గద్వాల జిల్లా, అక్టోబర్ 10 (ప్రజా కలం):ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో పంటల పరిస్థితి, రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న రైతు వేదికల వద్ద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత గ్రామాల రైతులు నిర్దిష్ట సమయానికి రైతు వేదికలకు చేరుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించాలని సంబంధిత అధికారులకు తెలిపారు.



## అలంపూర్‌లో రాష్ట్రస్థాయి హాకీ సమరం!

### అక్టోబర్ 12 నుంచి 14 వరకు అండర్-17 బాలుర హాకీ పోటీలు

### ఎమ్మెల్యే విజయుడికి ఆహ్వాన పత్రిక అందజేసిన అధికారులు



అలంపూర్, అక్టోబర్ 10 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 70వ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-17 బాలుర హాకీ టోర్నమెంట్ ఎంపిక పోటీలకు అలంపూర్ వేదిక కానుంది. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడికి సంబంధిత అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి హాకీ పోటీల ప్రారంభోత్సవానికి హాజరై యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని అధికారులు ఎమ్మెల్యే విజయుడిని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో అక్టోబర్ 12 నుంచి 14వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 12వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోనున్నారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీల నిర్వహణతో అలంపూర్ పట్టణానికి క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు లభించనుంది. యువ క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఈ పోటీలు చక్కని వేదికగా నిలవనున్నాయి.

## క్రి.శే. వర్ధనేని దేవేందర్ రావు విగ్రహానికి నివాళులర్పించిన పర్వతగిరి ప్యాక్స్ చైర్మన్, సర్పంచ్

(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 10, ప్రజాకలం ప్రతినిధి:



పర్వతగిరి మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ పంపు చౌరస్తాలో దివంగత కాంగ్రెస్ నాయకులు, పర్వతగిరి మాజీ ఎంపీపీ క్రీ.శే. వర్ధనేని దేవేందర్ రావు వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన పర్వతగిరి ప్యాక్స్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, పర్వతగిరి సర్పంచ్ చిదురు శంకర్. ఈ సందర్భంగా పర్వతగిరి టౌన్ అధ్యక్షులు నరెడ్ల సంతోష్, కల్లేడ గ్రామ పార్టీ అధ్యక్షులు మాసాడి రాజేశ్వరరావు, ప్యాక్స్ డైరెక్టర్ నరెడ్ల సూరయ్య, ఐనవోలు దేవస్థాన డైరెక్టర్ దారం పూర్ణ చందర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పిన్నింటి సునీల్ రావు, మాజీ గ్రామ మాజీ టౌన్ అధ్యక్షులు కుసం రామచందర్, మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్దన్, నాయకులు చింతపట్ల అజయ్ రావు, మార్కండేయ, చింతకుంట్ల మల్లికార్జున్, పోకల శంకర్, కొండా వెంకటేశ్వర్లు, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

## పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలి

### ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, అక్టోబర్ 10

భద్రాచలం పట్టణంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు భూమి కొనుగోలు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, 20 వార్డుల్లో అద్దె ఇళ్లలో నివసిస్తున్న నిరుపేదలను గుర్తించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అవకాశం కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు అందే దుర్గ మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణంలో అనేకమంది అర్హులైన నిరుపేదలు కూలి పనులు చేసుకుంటూ సుమారు 30 ఏళ్లుగా అద్దె ఇళ్లలో నివసిస్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె ఇళ్లలో నివసించే కుటుంబ పెద్ద అనారోగ్యంతో మరణిస్తే, ఆ కుటుంబాలు మరింత దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు.ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన పేదలకు నేరుగా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భద్రాచలంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పేదల పక్షాన ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ నిరంతరం పోరాటం చేస్తుందని, ఈ ఉద్యమంలో పేదలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**నిరసనకు పలు సంఘాల మద్దతు**

ఈ నిరసన దీక్షకు మహాజన మహిళా మండలి రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల లత, మాదిగ మహిళా సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చిట్యాల రజిత, జిల్లా నాయకురాలు కొప్పుల నాగమణి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అలవాల రాజా మాదిగ, మహాజన సమితి వ్యవస్థాపకులు గద్దం సుధాకర్, దళిత సంఘాల నాయకులు చింత నాగ ముత్యం, కోకిల గాంధీ, సంఘీవం తదితరులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ నాయకులు వెన్న రేవతి, మల్లీడి సత్యవేణి, దళై స్వర్ణ, గంజి ఝాన్సీ, పుట్టి మేరి, పూసం సుజాత, శ్రీదేవి, ఎం. భార్గవి, రమాదేవి, సమీనా, జయమ్మ, కుమారి, మేకల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రీజోనెన్స్ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



హనుమకొండ అక్టోబర్ 10 ప్రజా కలం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సాంప్రదాయాలకు పతికగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని హనుమకొండలోని రీజోనెన్స్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.కళాశాల విద్యార్థిని విద్యార్థులు,తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మేనేజ్మెంట్ పెద్ద సంఖ్యలో పాల్గొని మొదటి రోజు బతుకమ్మ ఉత్సవాలను ఆనందోత్సవాల మధ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా వందలాదిమంది విద్యార్థులు సంప్రదాయపద్ధంగా బతుకమ్మలను అలకరించి బతుకమ్మ పాటలు నృత్యాలు దండియా కోలాటం తదితర సంస్కృతిక కార్యక్రమాలను అత్యంత ఉత్సాహంగా ప్రదర్శించారు.విద్యార్థుల సంప్రదాయ దుస్తులు రంగురంగుల బతుకమ్మలు పాటలు నృత్యాలతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలను వీక్షించేందుకు పలువురు తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఆనందించారు. విద్యార్థుల ప్రతిభను ఉత్సాహాన్ని అభినందించారు.అలాగే పట్టణ ప్రజలు కూడా ఈ వేడుకలను ఆసక్తిగా వీక్షించి విద్యార్థులను అభినందించారు.బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మహత్యకు ప్రకృతితో అనుబంధానికి మన సంస్కృతి మరియు సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతిగా నిలుస్తుందని ఇటువంటి పండగల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన మరియు గౌరవ భావాలను పెంపొందించవచ్చని కళాశాల యాజమాన్యం పేర్కొంది.ఈ కార్యక్రమానికి రీజనెన్స్ కళాశాల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి,కళాశాల డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి,సీఈవో లెక్కల రమ్య రాజిరెడ్డి కళాశాల డీన్ బిఎస్ గోపాలరావు,ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత ఫ్యాకల్టీ సభ్యులు క్లాస్ టీచర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రీజనెన్స్ కళాశాల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం తమ రీజనెన్స్ కళాశాల విద్యార్థిని విద్యార్థుల్లో అనేకమంది జాతీయస్థాయిలో నిర్వహించే ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ నీట్ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించడంతోపాటు దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటీలు ఎన్ఐటీలు మరియు దేశంలోని ప్రముఖ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీట్లు సాధిస్తూ వరంగల్ కు గర్వకారణంగా నిలుస్తున్నారని తెలిపారు.బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక వైభవం తెలంగాణ సాంప్రదాయాలకు అద్దం పట్టిందని భవిష్యత్తులోనూ ఇలాంటి సంస్కృతిక కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తామని కళాశాల యాజమాన్యం తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్క్రీనింగ్ పరీక్ష

### ప్రతిభావంతులైన 120 మందికి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ

### మరో 250 మందికి ఆన్‌లైన్ తరగతులు

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ప్రత్యేక కార్యక్రమం

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారిని జాతీయ స్థాయి ఉపకార వేతనాలకు అర్హులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆదివారం (అక్టోబర్ 11) ఎన్ఎంఎంఎస్ (చీవీమీ) స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయ కర్త రవీందర్ రెడ్డి ఓ సంయుక్త ప్రకటన లో తెలిపారు. గౌరవ ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారిలి సహకారంతో 'మహబూబ్‌నగర్ ఫస్ట్', 'వందేమాతరం ఫౌండేషన్' సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. స్థానిక మోడ్రన్ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకావడానికి అర్హులు. స్క్రీనింగ్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 120 మంది విద్యార్థులను ఎంపిక చేసి, అక్టోబర్ 22 నుంచి 31 వరకు పది రోజుల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నారు. నిష్ణాతులైన అధ్యాపకుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. తదుపరి స్థానాల్లో నిలిచిన మరో 250 మంది విద్యార్థులకు ఎనిమిది రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

గత ఏడాది ప్రభుత్వ విప్ లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి ప్రత్యేక చొరవ, సహకారంతో నియోజకవర్గంలోని 60 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారు. అర్హత పొందిన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు మొత్తం రూ. 48 వేల ఉపకార వేతనం లభిస్తోంది. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా మరింత మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకుని ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ స్క్రీనింగ్ పరీక్షకు హాజరయ్యేలా చూడాలని వారు కోరారు.

## ఖమ్మం కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక - ప్రకృతిని, పూల అందాలను ఆరాధించే విశిష్టమైన పూల పండుగ బతుకమ్మ తొమ్మిది రోజుల పాటు శాఖల వారీగా వేడుకల నిర్వహణ

ఖమ్మం, అక్టోబర్ 10 (ప్రజా కలం న్యూస్)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలు ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలను వ్యవసాయ, మార్కెటింగ్, ఇతర సంబంధిత శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలతో వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతిపై మనకున్న ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. వివిధ రకాల సహజసిద్ధమైన పూలతో బతుకమ్మ లలను పేర్చి, వాటిని పూజిస్తూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటిచెబుతుందని ఉద్యోగులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బతుకమ్మను ప్రజలందరూ సంప్రదాయబద్ధంగా, పర్యావరణహితంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పూల పండుగగా పేరుగాంచిన బతుకమ్మ ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుందని, తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని భావితరాలకు అందించే గొప్ప వేడుక అని తెలిపారు.

**తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల నిర్వహణ:**

ఈ నెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించ నున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు నిర్దేశించిన శాఖల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రోజుల వారీగా బతుకమ్మ వేడుకల నిర్వహణ బాధ్యతలను వివిధ శాఖలకు కేటాయించినట్లు తెలిపారు. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన సంబరాలు రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయని వివరించారు.



**పర్యావరణహితంగా వేడుకలు నిర్వహించాలి:**బతుకమ్మ వేడుకల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, సహజసిద్ధమైన పూలు, పర్యావరణ హిత వస్తువులను మాత్రమే వినియోగించాలని కలెక్టర్ సూచించారు. చెరువులు, నిమజ్జన ఘాట్ల వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, బతుకమ్మ పండుగను సంప్రదాయ వైభవంతో, ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. శనివారం చేపట్టిన బతుకమ్మ వేడుకల్లో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, కలెక్టరేట్ కేర్ టేకర్ వెంకన్న, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మెడికో వైద్యుల స్టైఫండ్ విడుదల చేయాలి: సీఐటీయూ




గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 10 (ప్రజా కలం):

మెడికో వైద్యులకు పెండింగ్‌లో ఉన్న స్టైఫండ్‌ను తక్షణమే విడుదల చేయాలని, దేశవ్యాప్తంగా వైద్యులందరికీ ఒకే విధమైన స్టైఫండ్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పేర్ నరసింహ, వీవీ నరసింహ డిమాండ్ చేశారు. శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో స్టైఫండ్ బకాయిల విడుదల కోసం పోరాటం చేస్తున్న వైద్యులకు వారు మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. విదేశాల్లో ఐదేళ్లపాటు ఎంబీబీఎస్ పూర్తి చేసి, స్వదేశంలో ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ)లో ఉత్తీర్ణత సాధించిన వైద్యులకు నెలల తరబడి స్టైఫండ్ బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమని అన్నారు. ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేసే వైద్యులకు నెలకు రూ. 29,792 స్టైఫండ్ ఇవ్వాల్సి ఉండగా, తెలంగాణ ప్రభుత్వం గత మూడేళ్లుగా నెలకు కేవలం రూ. 5,000 మాత్రమే చెల్లిస్తోందని విమర్శించారు. గత ఏడాది కాలంగా చెల్లించాల్సిన స్టైఫండ్ కూడా పెండింగ్‌లో ఉండటంతో వైద్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు సుమారు రూ. 166 మాత్రమే స్టైఫండ్‌గా అందడం వైద్యుల శ్రమకు తగిన గుర్తింపు కాదని పేర్కొన్నారు.

రోగులకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వైద్యులకు ఒకే విధమైన స్టైఫండ్ అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్‌లో ఉన్న స్టైఫండ్‌ను వెంటనే విడుదల చేయడంతోపాటు, దేశవ్యాప్తంగా ఒకే విధమైన స్టైఫండ్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వైద్యుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

మెడికో వైద్యులు చేస్తున్న పోరాటానికి కార్మిక సంఘాలు, సామాజిక సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని సీఐటీయూ నాయకులు కోరారు. వైద్యుల పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని, భవిష్యత్తులో వారు నిర్వహించే ఆందోళన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ మైథిల్, డాక్టర్ ఓంకార్, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ నిహిత, డాక్టర్ సోనిక, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## చలో నిర్మల్ కార్యక్రమంలో పాల్గొన్న ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు

### ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్




నిర్మల్ అక్టోబర్ 10 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఏఐసీసీ పిలుపు మేరకు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ పిలుపుతో, మాజీ శాసనసభ్యులు జి. విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చలో నిర్మల్ నిరసన కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతకు సంబంధించిన అంశాలపై తమ నిరసనను వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు చలో నిర్మల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముధోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇండియా కూటమి నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మాజీ సర్పంచులు, ఎస్సీ సెల్ విభాగం నాయకులు, సభ్యులు, కార్యకర్తలు హాజరై నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

జి. విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ పిలుపు మేరకు ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులు తమ నిరసనను తెలియజేశారు.

# 120 మంది గర్భిణీలకు అల్పాహారం పంపిణీ

### జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్య పరీక్షల కోసం వచ్చిన 120 మంది గర్భిణీలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధ్య రమేష్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు. గర్భిణీలకు వాటర్ బాటిళ్లు, పెరుగు, బిస్కెట్లు, రస్క్ ప్యాకెట్లతో కూడిన కిట్లను అందజేశారు. మాతృత్వ సమయంలో గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమనే ఉద్దేశంతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల సూచనల మేరకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలకు వైద్య పరీక్షల అనంతరం అల్పాహారం, తాగునీరు, పెరుగు, బిస్కెట్లు, రస్క్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో గర్భిణీలకు అవసరమైన సహకారం అందించేందుకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సేవలందించారు. వైద్య సేవలతో పాటు గర్భిణీలకుఅవసరమైన ఆహారాన్ని అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వఆసుపత్రిలో నిర్వహిస్తున్న మాతృత్వ ఆరోగ్య కార్యక్రమాలను గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఆధ్య రమేష్, డాక్టర్ పావని, డాక్టర్ నాగార్జున, ఎంపీహెచ్ఈవో నీలాద్రి లక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్న కంబలూరు గ్రామంలో అగ్నిప్రమాదం

రుద్రవరం : మండలంలోని చిన్న కంబలూరు గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 950 కట్టల పశుగ్రాసం దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు గ్రామానికి కుమ్మరి మద్దయ్య, కుమ్మరి చిన్న తిమ్మయ్య లకు చెందిన దాదాపు 950 కట్టల పశుగ్రాసాన్ని నిల్వ చేసి ఉంచారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పశుగ్రాసానికి నిప్పు పెట్టి వెళ్లడంతో మంటలు రావటంతో గ్రామస్తులు గుర్తించి మంటలు ఆర్పడానికి ప్రయత్నించారన్నారు. మంటలు అదుపులోకి రాకపోవడముతో ఆళ్లగడ్డ అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని మంటలను ఆర్పీ వేశారన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరి రైతులకు దాదాపు రూ 3 లక్షల విలువ చేసే పశుగ్రాసము దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి పశుగ్రాసం నష్టపోయిన రైతులకు తిరిగి పశుగ్రాసం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరారు.

## అటవీ సంరక్షణ కొరకు మూడు కొత్త బేస్ క్యాంపులు ఏర్పాటు

రుద్రవరం : రుద్రవరం రేంజ్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ సంరక్షణ కొరకు మూడు కొత్త బేస్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు రేంజ్ అధికారి ముర్తుజావలి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ కొరకు ప్రభుత్వము చర్యలు చేపట్టిందని అందులో భాగంగా రుద్రవరం రేంజ్ పరిధిలో బేస్ క్యాంపులు పెంచడం జరిగిందని రేంజ్ అధికారి తెలిపారు. ఇందులో భాగంగా మేడం బావి బీట్ లో బేస్ క్యాంపు, మిట్టపల్లె బీట్ లో బేస్ క్యాంపు, పెద్ద వంగలి బీచ్ లో బేస్ క్యాంపును కొత్తగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఈ బేస్ క్యాంపులో ఒక్కొక్క బేస్ క్యాంపులో 5గురిని నియమించామని రేంజ్ అధికారి తెలిపారు. అహోబిలం, ఊట్ల, టీజీపీ కాలనీ, పెద్దవంకరబాయి ఎస్ క్యాంపులను గతంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం ఏర్పాటు చేసిన బేస్ క్యాంపులతో పాత వాటిని కలుపుకొని రుద్రవరం రేంజ్ పరిధిలో మొత్తం 7 బేస్ క్యాంపులు అటవీ సంరక్షణ కొరకు ఏర్పాటు చేయడం జరిగిందని రేంజ్ అధికారి తెలిపారు.

## ప్రభుత్వ అసహనం,అసమర్థతతో రైతుల అరెస్టులా?

వనపర్తి : రైతులపై పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలి. సింగిరెడ్డి. నిరంజన్ రెడ్డి మాజీ మంత్రిఅన్నం పెట్టే అన్నదాతలు అందరికోసం పంటలు కాపాడాలని కోరితే అక్రమ అరెస్టులతో అక్రమ కేసులతో వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అని నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. నిరంజన్ రెడ్డి మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్ , లక్ష్మారెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే చిట్టెం. రామ్ మోహన్ రెడ్డి తో ఆత్మకూరులో పత్రికా సమావేశంలో మాట్లాడుతూ జూరాలలో 9టి.ఏం.సి ల నీటి లభ్యత ఉన్నా దిగుబడికి వచ్చిన పంటలకు నీళ్లు వదలాలని నిరసన వ్యక్తం చేసిన రైతులపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గ చర్య అని ఖండించారు. రైతులపై ప్రజా ఆస్తుల విధ్వంసం(పి.డి.పి.పి)యాక్టు పెట్టడం ప్రభుత్వ అణిచివేతకు నిదర్శనం అని దుయ్యబట్టారు. 20సెప్టెంబర్ నాడు కేసు నం 103/2026మీద పి.డి. పి.పి కేసు పెట్టడం రైతుల హక్కులు హరించడం అని అన్నారు. సాగు జలాలు సాధించడానికి అవసరమైన కార్యాచరణ కోసం అనుభవంతో సలహాలు ఇచ్చాం, అధికారులతో మాట్లాడం జరిగిందని ప్రభుత్వం పేడ చెవిన పెట్టడంతో రైతులు తిరగబడ్డారని నిజం తెలుసుకొని రైతులకు ఊరట ఇవ్వడం మాని వేధించడం అన్యాయం అని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీపై ఉన్న ధ్యాస రైతులపై లేదు అని పాలమూరు బిడ్డనని చెప్పి ప్రాజెక్టులు పడావ్ పెట్టారని ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఆధరం,బేధరం ప్రజల పక్షాన నిలబడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రుద్రవరం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీడీవో భాగ్యలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు లు అన్నారు. యుహెచ్డీ కార్యక్రమంలో భాగంగారుద్రవరం ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం (విబిజి రాంజీ)సిబ్బంది సహకారంతో 1,625 మొక్కలు నాటే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు ఎల్.వి రంగయ్య , అల్లడి శేఖర్, యువరాజు పాఠశాల కమిటీ చైర్మన్ బాలకృష్ణ వైస్ చైర్మన్ శ్రీను ఏపీవోగౌరీ బాయ్, ఈసీ సుబ్బన్న టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ వైస్ ప్రిన్సిపల్ రజినీ ఉపాధ్యాయులు ఈరన్న ,దివాకర్ హిందీ ఉపాధ్యాయులు నాగరాజు , కిరణ్ కుమార్ , జ్యోతి ప్రియ హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ వాలంటీర్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు, కాలుష్యాన్ని తగ్గించి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించవచ్చని తెలిపారు. నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించడం ద్వారా వాటిని భవిష్యత్తులో పెద్ద వృక్షాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలను పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణ స్పృహతో కూడిన ఆరోగ్యకరమైన ప్రాంగణంగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో ప్రకృతి ప్రేమ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

మహబూబాబాద్ : పౌరసరఫరాల శాఖ పూర్తి అదనపు బాధ్యతల మేనేజర్ వాసంశెట్టి నరసింహారావు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ ఆధ్వర్యంలో మేనేజర్ నరసింహారావు నివాసంతోపాటు, ఆయన సంబంధీకులు, బంధువులు, బినామీల నివాసాల్లో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు చేస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, హైదరాబాద్ తదితర మొత్తం ఏడు ప్రాంతాల్లోని నరసింహారావుకు చెందిన ఆస్తుల కూపీ లాగుతున్నారు. ఖమ్మంలో నరసింహారావుకు చెందిన రెండు విలాసవంతమైన భవనాల్లో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే నరసింహారావుకు చెందిన అక్రమ ఆస్తులను భారీ ఎత్తున గుర్తించినట్లు సమాచారం.

# ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీలకు భద్రాచలం క్రీడాకారుడు డి.వి. శంకర్‌రావు

### జాతీయ స్థాయిలో నాలుగు స్వర్ణ పతకాలతో సత్తా చాటిన రిటైర్డ్ బ్యాంకు అధికారి



ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, అక్టోబర్ 10:

ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీలకు భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన క్రీడాకారుడు డి.వి. శంకర్‌రావు వెళ్లనున్నారు. వయసు పెరుగుతున్నా పట్టుదలతో సాధన చేస్తూ క్రీడా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన ప్రయాణం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన శంకర్‌రావు రిటైర్డ్ బ్యాంకు అధికారి. 2012లో 60 ఏళ్ల వయసులో గుండె సంబంధిత సమస్యతో ఆయనకు కరోనరీ బైపాస్ సర్జరీ జరిగింది. అయినప్పటికీ ఆరోగ్యంపైశ్రద్ధతో, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలనే సంకల్పంతో భద్రాచలంలోని సిటీ స్టైల్ జిమ్‌లోకోచ్ జి.వి.రామిరెడ్డిపర్యవేక్షణలోశిక్షణ ప్రారంభించారు.

**జాతీయ స్థాయిలో నాలుగు స్వర్ణ పతకాలు**

జిమ్‌లో శిక్షణ ప్రారంభించిన కొద్దికాలానికే పవర్ లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకున్న శంకర్‌రావు, కేరళలోని కోజికోడ్‌లో నిర్వహించిన జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. స్క్వాట్, బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ విభాగాలతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లోనూ స్వర్ణ పతకాలు సాధించి మొత్తం నాలుగు బంగారు పతకాలను తన ఖాతాలో వేసుకున్నారు. ఆరోగ్య సమస్యలను అధిగమిస్తూ క్రీడల్లో రాణించడం ద్వారా వయసు అనేది కేవలం సంఖ్య మాత్రమేనని, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని శంకర్‌రావు నిరూపించారు. ఇప్పుడు ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండటంతో భద్రాచలం క్రీడాభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా సిటీ స్టైల్ జిమ్ కోచ్ జి.వి. రామిరెడ్డి, మైదిరెడ్డి రామిరెడ్డి, కురినాల వెంకటేశ్వర్లు, పాల్ బర్లి, ఐ. వెంకటేశ్వరరావు, గాదె నిశాంత్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం నూతన సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన జేఏసీ అధ్యక్షుడు మర్మం శంకరన్న

### నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపిన జేఏసీ నాయకులు, యూనియన్ సభ్యులు

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, అక్టోబర్ 10




భద్రాచలం నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) గారిని జేఏసీ అధ్యక్షుడు మర్మం శంకరన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సీఐకి శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు మర్మం శంకరన్నతో పాటు నడిపింటి దుర్గాప్రసాద్, కొత్తపల్లి సాత్విక్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరస్పరం పరిచయాలు చేసుకుని, మర్యాదపూర్వకంగా మాట్లాడుకున్నారు. భద్రాచలం ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలు కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీసు యంత్రాంగం పాత్ర ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. నూతన సీఐ బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని జేఏసీ అధ్యక్షుడు మర్మం శంకరన్న, యూనియన్ సభ్యులు ఆకాంక్షించారు.

# మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

### మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు-డాక్టర్ కృష్ణమోహన్




నాగర్‌కర్నూల్, అక్టోబర్ 10 (ప్రజా కలం): మానసిక ఆరోగ్యమే మహాభాగ్యమని, మానసిక సమస్యలతో బాధపడేవారు వాటిని దాచిపెట్టకుండా నిపుణులైన కౌన్సిలర్ల సహాయం పొందాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్ సూచించారు. శనివారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, మానసిక సమస్యల పట్ల ఉన్న అపోహలు, వివక్షను తొలగించడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఆందోళన, భయం, నిరాశ, నిద్రలేమి వంటి లక్షణాలు నిరంతరం వేధిస్తుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. మానసిక సమస్యలకు కూడా సరైన చికిత్సతో ఉపశమనం పొందవచ్చని తెలిపారు. మానసిక సమస్యలతో బాధపడేవారి మాటలను ఓపికగా విని, వారికి మానసిక ధైర్యాన్ని అందించాలని కోరారు. మానసిక సమస్యలకు సత్వర సహాయం కోసం టెలి మానస్ 14416కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ సేవల ద్వారా 24 గంటల పాటు నిపుణులైన కౌన్సిలర్ల సహాయం పొందవచ్చని వివరించారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం అవసరమన్నారు. యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు మానసిక ప్రశాంతతకు దోహదపడతాయని పేర్కొన్నారు. మానసిక సమస్యలతో బాధపడేవారిని వివక్షతో చూడకుండా, వారికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో అధికారులు మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో చెస్ అకాడమీ..

### - కోనేరు హంపికి మంత్రి లోకేశ్ హామీ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి చెస్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఈ మేరకు ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చేసిన విజ్ఞప్తి పట్ల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. అకాడమీ స్థాపనకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి లోకేశ్‌తో కోనేరు హంపి, ఆమె తండ్రి అశోక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన హంపిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నీలో భారత మహిళల జట్టు కాంస్య పతకం సాధించడంలోనూ, వ్యక్తిగత విభాగంలో బోర్డు-1పై కాంస్యం గెలవడంలోనూ హంపి పోషించిన కీలక పాత్రను ఆయన ప్రశంసించారు. భవిష్యత్ తరం క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో అమరావతిలో ఒక ప్రత్యేక చెస్ అకాడమీని ఏర్పాటు చేయాలన్న తన ఆకాంక్షను హంపి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ బృహత్కార్యానికి ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అకాడమీ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో చదరంగ క్రీడకు మరింత ప్రోత్సాహం లభించనుంది.

# ఖమ్మంలో శ్రీవారి ఆలయ శంకుస్థాపనకు హాజరు కావాలని షెడ్యూల్ కులాల నాయకుల పిలుపు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ తదితర నాయకులు

ఖమ్మం, అక్టోబర్ 10(ప్రజా కలం న్యూస్ )



ఖమ్మం నగరంలోని అల్లిపురం ప్రాంతంలో శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి నూతన దేవస్థాన శంకుస్థాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని, షెడ్యూల్ కులాల జేఏసీ నాయకులు శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు.


తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షులు, దళిత రత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిశారు. ఈ నెల 12వ తేదీన ఖమ్మం నగరంలో నిర్వహించనున్న కలియుగ వెంకటేశ్వర స్వామి దేవస్థాన శంకుస్థాపన కార్యక్రమానికి షెడ్యూల్ కులాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతామని మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం నగర డీసీసీ అధ్యక్షులు నాగర్ల దీపక్ సోదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా తదితరులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నాయకులకు పరిచయం చేసినట్లు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవస్థాన శంకుస్థాపన మహోత్సవంలో కులమతాలకు అతీతంగా ఖమ్మం నగర ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసరావు, బేడ బుడగ జంగం జిల్లా అధ్యక్షులు చిన్న గంగులు, టీఎంహెచ్‌డీ నాయకులు పిల్లిగుండ్ల ముత్తయ్య, జంగం వెంకయ్య, వీరస్వామి, వెంకట్ నారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలి

సిద్దిపేట : సిద్దిపేట నుండి సిరిసిల్ల వరకు రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో రైల్వే ప్రాజెక్టు ముఖ్య అధికారులు, రెవెన్యూ,అర్ అండ్ బి, పిఆర్ అధికారులతో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎన్. నవ్య శ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో రైల్వే లైన్ నిర్మాణంలో పెండింగ్ లో సమస్యలు, బ్రిడ్జి నిర్మించే ప్రాంతాల్లో భూ సేకరణ వివరాలు గూర్చి రైల్వే అధికారులు కలెక్టర్ కి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. చిన్నకోడూరు మండలంలో చిన్నకోడూరు మాచాపూర్, గంగాపూర్ విఠలాపూర్, నారాయణరావు పేట మండలం లో గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో పెండింగ్ సమస్యల గూర్చి అధికారులతో క్లుప్తంగా చర్చించారు. పెండింగ్ లో ఉన్న ప్రాంతాలను రైల్వే, రెవెన్యూ, అర్ అండ్ బి, పిఆర్, అందరూ కలిసి పర్యవేక్షణ చేసి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టే దగ్గర డైవర్షన్ బీటీ రోడ్ ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, భూ సేకరణ పెండింగ్ తదితర పూర్తి సమాచారాన్ని జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రైల్వే పనుల వల్ల పక్కన రైతులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చెయ్యాలని, బ్రిడ్జి నిర్మాణాలు వేగంగా పూర్తి చెయ్యాలని రైల్వే అధికారులను ఆదేశించారు. రైల్వే పనులు అయ్యేంతవరకు స్థానిక శాఖల అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ సదానందం, రైల్వేస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మూర్తి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌తోనే గద్వాలకు ప్రత్యేక గుర్తింపు!

### - జిల్లా ఉద్యమకారులకు బీఆర్ఎస్ ఘన సన్మానం



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 10 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములుతో కలిసి బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టారని తెలిపారు. అందులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లాను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని పేర్కొన్నారు. కేసీఆర్ దూరదృష్టితో జిల్లాల ఏర్పాటు జరిగిందని, పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాకు ప్రత్యేక గుర్తింపు కల్పించిన కేసీఆర్‌కు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన పోరాటం, త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఉద్యమకారులను సన్మానించడం ఆనందంగా ఉందని, తెలంగాణ ఉద్యమంలో వారు అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఉద్యమాభివందనాలు తెలియజేస్తున్నామని బాసు హనుమంతు నాయుడు అన్నారు.

## నేర సమీక్ష సమావేశంలో పోలీసు అధికారులకు ఎస్పీ డి. సునిత రెడ్డి ఆదేశాలు

వనపర్తి : వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి. సునిత రెడ్డి, ఐపీఎస్ గారు నేర సమీక్ష సమావేశం నిర్వహించి, జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం మరియు పోలీసు సేవల మెరుగుదలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఎఫ్ఐఆర్‌ను ఈ-సాక్ష్య విధానంలో నమోదు చేసి, సంబంధిత ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు, బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం 60 రోజులు, 90 రోజుల గడువులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదయ్యే ఎఫ్ఐఆర్‌లు, జీరో ఎఫ్ఐఆర్‌ల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. టీజీ కాప్, హెచ్ఆర్ఎంఎస్, సీఈఐఆర్ పోర్టల్‌లను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు విధులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ఇన్వెస్టిగేషన్‌లో టెక్నాలజీ వినియోగాన్ని పెంచి, నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. డయల్-112 ద్వారా అందే అత్యవసర ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు సకాలంలో సహాయం అందించాలని తెలిపారు. నాట్‌గ్రిడ్ వ్యవస్థను నిబంధనల ప్రకారం వినియోగిస్తూ, సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం పెంపొందించాలని సూచించారు. ఈ-పెట్టీ కేసులు, ఐటీ యాక్ట్ సంబంధిత కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పరిష్కారం మరియు పెండింగ్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. చార్జ్‌షీట్ దాఖలు శాతాన్ని పెంచడంతో పాటు, సమన్లు మరియు వారెంట్ల అమలును వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని వనపర్తి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతి

ఏలూరు : తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామానికి చెందిన లక్ష్మి(40), కుమారుడు చంద్రశేఖర్ (23) బైక్ పై రాజమహేంద్రవరంలోని తమ బంధువుల కుమార్తె ప్రసవించగా.. వారిని చూసేందుకు బయలుదేరారు. కంసాలిపాలెం-రావిమెట్ల వద్ద బైక్ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. తల్లీకొడుకు స్పాట్ లో మృతి చెందారు. దాంతో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

# ఆత్మగౌరవమే ముఖ్యం.. సమాజానికి గొప్ప సందేశం..



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ప్రసవానంతర శారీరక మార్పులపై సోషల్ మీడియాలో కొందరు పనికిరాని ట్రోల్స్ చేస్తుండగా, తాజాగా ఆమె వాళ్లకు గట్టి కౌంటర్ ఇచ్చారు. లండన్‌లో జరిగిన 'కే బ్యూటీ' ఈవెంట్‌లో బాడీ షేమింగ్ కామెంట్లపై ఆమె తొలిసారి నోరు విప్పారు. అసలు ఆమె ఏమన్నారనే పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం. ఆత్మగౌరవమే అందరికీ ముఖ్యం: ఈవెంట్‌లో భాగంగా సోషల్ మీడియా విమర్శలపై కత్రినా స్పందిస్తూ చాలా స్పష్టమైన మాటలు చెప్పారు. "సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన కామెంట్లు మన జీవితాన్ని, మన నిర్ణయాలను ప్రభావితం చేయకూడదు.. ఒకవేళ ఆ నెగెటివ్ మాటలనే నేను పట్టుకుని కూర్చుంటే, భయంతో అక్కడే ఆగిపోయేదాన్ని. ప్రతి ఒక్కరూ తమకు తాముగా సొంత శ్రేయోభిలాషిగా మారడం చాలా ముఖ్యం" అని ఆమె ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పుకొచ్చారు. గత ఏడాది నవంబర్‌లో కత్రినా కైఫ్ – విక్కీ కౌశల్ దంపతులు తమ కుమారుడు విహాన్‌కు జన్మనిచ్చారు. ఆ తర్వాత ఇటీవల అంబానీ ఇంట జరిగిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న ఆమెపై కొందరు బరువు పెరిగారంటూ దారుణంగా ట్రోల్ చేశారు. దీనిపై స్పందిస్తూ.. పిల్లలు పుట్టాక తల్లి శరీరం మారడం అత్యంత సహజమైన ప్రక్రియ అని, తన దృష్టిలో అందంగా ఉండటం అంటే కేవలం సన్నగా కనిపించడం కాదని, ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండటమే అని తెలిపారు. వయసుతో పాటు వచ్చే పరిణతి: ఇండస్ట్రీలో వయసు మరియు అందం గురించి ఉండే అవాస్తవిక అంచనాలను ఆమె పూర్తిగా తోసిపుచ్చారు. నేను ఎప్పుడూ 21 ఏళ్ల అమ్మాయిలా కనిపించలేను.. అలా కనిపించాలన్న ఆశ కూడా లేదు.కూడా. వయసు పెరుగుతున్న కొద్దీ వచ్చే పరిణతిని, శారీరక మార్పులను మనం గౌరవించాలి" అంటూ చాలా మెచ్యూర్డ్‌గా ఆన్సర్ ఇచ్చారు. ఇక ఆమె చెప్పిన ఈ మాటలు ఫ్యాన్స్ నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి. కత్రినాను కొందరు బాడీ షేమింగ్ చేసినప్పుడు సల్మాన్ ఖాన్ 'బిగ్ బాస్' వేదికగా తీవ్రంగా మండిపడ్డారు. అలాగే హృతిక్ రోషన్, పరిణీతి చోప్రా, ఖుష్బూ సుందర్ వంటి ప్రముఖులు కూడా ఆమెకు అండగా నిలిచారు. ఇక ఇప్పుడు స్వయంగా కత్రినా రంగంలోకి దిగి, ట్రోలర్స్‌కు తనదైన శైలిలో స్ట్రాంగ్ రిప్లై ఇవ్వడంతో ఈ ఇష్యూ మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఇక మొత్తానికి, బాడీ షేమింగ్ లాంటి చీప్ ట్రోల్స్‌కు భయపడకుండా, వాటిని ధైర్యంగా ఎదుర్కొని కత్రినా కైఫ్ అందరికీ ఒక గొప్ప సందేశం ఇచ్చారు. సోషల్ మీడియాలో ఎవరెవరో ఏదేదో మాట్లాడతారని కుంగిపోకుండా, మనల్ని మనం ప్రేమించుకోవడం ఎంత ముఖ్యమో ఆమె నిరూపించారు. ఇక ట్రోలర్స్‌కు ఈ అద్భుతమైన సమాధానంతో కత్రినా మరోసారి తన పరిణతిని చాటుకున్నారు.

# గురూజీ.. ఇంకాస్త ఎక్కువ చేస్తే తప్పేంటి!



వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్ అనగానే ఆటోమేటిక్ గా బజ్ వచ్చేస్తుంది. కానీ ఆదర్శ కుటుంబం విషయంలో మాత్రం సీన్ కాస్త రివర్స్ లో ఉంది. ఇప్పటివరకు వచ్చిన టీజర్, పోస్టర్లు, పాటలు జనాల్లో అనుకున్నంత ఇంపాక్ట్ క్రియేట్ చేయలేదు. పోస్ట్ ప్రొడక్షన్ లేట్ అవ్వడం వల్ల రిలీజ్ వాయిదా పడిందని మేకర్స్ చెబుతున్నారు. అయితే పనులు ఆలస్యం అవ్వడం వేరు, ఆడియన్స్ లో సినిమా మీద సరైన హైప్ లేకపోవడం వేరు. కరెక్ట్ గా రిలీజ్ కు ముందు సినిమాకు ఈ హైప్ మిస్ అవుతోందన్న ఫీలింగ్ ఇండస్ట్రీలో కనిపించింది. నిజానికి గురూజీ మాటలకు బయట ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆయన స్టేజ్ మీద ఒక చిన్న పంచ్ వేసినా క్షణాల్లో వైరల్ అవుతుంది. ఇలాంటప్పుడు తన సినిమా కోసం ఆయన కాస్త యాక్టివ్ గా ప్రమోషన్స్ లోకి దిగితే ఆ బజ్ వేరే లెవెల్ లో ఉంటుంది. ఏదో యాంకర్ సుమ తో ఒక ఇంటర్వ్యూ లేదంటే టెక్నిషియన్స్ తో మరో ఇంటర్వ్యూ అనేది రొటీన్ పద్ధతి. దానికి ఇంకాస్త ఎక్కువ ప్రమోషన్స్ చేస్తే బాగుంటుంది అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇండియాలోనే నెంబర్ వన్ డైరెక్టర్ రాజమౌళి కూడా ఆర్ఆర్ఆర్ కోసం సందీప్ వంగా, అనిల్ రావిపూడి లాంటి వాళ్లతో స్పెషల్ ఇంటర్వ్యూలు చేశారు. యూట్యూబ్ ఛానళ్లు, మీమ్ పేజీల వరకు వెళ్లి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లారు. కంటెంట్ ఎంత గొప్పదైనా ప్రమోషన్స్ తో ఆడియన్స్ కు చేరువ కావడం చాలా అవసరం. ఇదే విషయంలో అనిల్ రావిపూడి స్టైల్ భలే సెట్ అవుతుంది. సినిమా అనౌన్స్ అయినప్పటి నుంచే హీరోలతో సరదా వీడియోలు, సెట్స్ లో అప్డేట్స్ ఇస్తూ జనాన్ని ఎంగేజ్ చేస్తారు. ఆదర్శ కుటుంబం కూడా పక్కా ఫ్యామిలీ, కామెడీ ఎంటర్టైనర్ కాబట్టి వెంకీతో కలిసి త్రివిక్రమ్ ఒక క్యాజువల్ చిట్ చాట్ చేసినా చాలు. సెట్స్ లో జరిగిన ఫన్నీ ఇన్సిడెంట్స్ పంచుకుంటే సినిమాకు విపరీతమైన కనెక్ట్ దొరుకుతుంది. ఇలాంటి ట్రెండీ ప్రమోషన్స్ చేస్తే గురూజీ స్థాయి ఏమాత్రం తగ్గదు సరికదా నేటి జనరేషన్ కు ఆయన ఇంకాస్త దగ్గరవుతారు. సినిమా కంటెంట్ బాగుంటే రిలీజ్ తర్వాత పాజిటివ్ టాక్ తో దానంతట అదే ఆడుతుంది. కానీ ఫస్ట్ డే థియేటర్ల దగ్గర హంగామా కనిపించాలంటే మాత్రం ముందే జనాల్లో క్యూరియాసిటీ పెంచాలి. ఆదర్శ కుటుంబం ప్రాజెక్ట్ కు సరిగ్గా ఇక్కడే గ్యాప్ కనిపిస్తోంది. బయట ఫంక్షన్లలో తన మాటల గారడీతో ఎంతో అటెన్షన్ తెచ్చే త్రివిక్రమ్, ఇప్పుడు తన సినిమా ప్రమోషన్స్ కోసం కొంచెం ఓపెన్ అయితే బాగుంటుంది. అప్పుడు మేకర్స్ కూడా బజ్ కోసం కష్టపడాల్సిన అవసరం అస్సలు ఉండదు.






# క్యూట్‌నెస్ రీలోడెడ్.. త్రిధా చౌదరి!




టాలీవుడ్‌లో యువ హీరోల సరసన నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల తార త్రిధా చౌదరి. క్యూట్ లుక్స్‌తో టాలీవుడ్ ప్రేక్షకులను అలరిస్తున్న ఈ భామ, ఒకప్పుడు స్టార్ హీరోయిన్ త్రిష లేని లోటును భర్తీ చేసేలా ఉందంటూ సోషల్ మీడియాలో అభిమానులు ప్రశంసిస్తున్నారు. కేవలం గ్లామరస్ పాత్రలకే పరిమితం కాకుండా.. వరుస చిత్రాలతో పాటు వైవిధ్యమైన వెబ్ సిరీస్‌ల ద్వారా తన ఇమేజ్‌ను మరింత పెంచుకునే పనిలో పడ్డారు. ప్రయోగాత్మక సిరీస్‌లలో ఈ బ్యూటీ కనబరిచిన అత్యుత్తమ నటన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. మరోవైపు సామాజిక మాధ్యమాలలోను త్రిధా జరంత స్పీడ్ మీద ఉంది. ఇటీవల త్రిధా చౌదరి షేర్ చేసిన ఒక లేటెస్ట్ బ్లూ-థీమ్డ్ అఫీషియల్ గ్లామర్ లుక్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటోగ్రాఫ్ కి ఫ్యాన్స్ నుంచి స్పందనలు అనూహ్యం. సీఈవో ఆఫ్ హెర్ వోన్ లిటిల్ యూనివర్స్ అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో త్రిధ షేర్ చేసిన ఈ పోస్ట్ కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుంటోంది. త్రిధ సోషల్ మీడియా ప్రొఫైల్‌లో కనిపిస్తున్న ఈ స్టైల్, కాన్ఫిడెన్స్ .. ఇండిపెండెంట్ పర్సనాలిటీకి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఈ పోస్ట్‌కు నెటిజన్లు నుంచి భారీ స్పందన లభించడమే కాక .. కామెంట్ సెక్షన్ అభిమానుల ప్రేమతో నిండిపోయింది. ఈ బ్యూటీ పోస్ట్‌లపై స్పందిస్తూ ఫ్యాన్స్ తనను బాస్ లేడీ అని, ఫ్రెష్ ఎయిర్ ఫర్ ది సోల్ అని కొనియాడుతున్నారు. కేవలం అందం మాత్రమే కాకుండా తనదైన శైలిలో సానుకూల విషయాలను షేర్ చేస్తూ డిజిటల్ కమ్యూనిటీతో ఎప్పుడూ టచ్‌లో ఉంటున్నారు. తెరపై ఎంత గ్లామర్‌గా కనిపిస్తారో.. నిజ జీవితంలోనూ అంతే పరిణతితో కూడిన ఆలోచనలు, సెల్ఫ్-యాక్సెప్టెన్స్ మ్యాటర్స్ లో యువతకు స్ఫూర్తినిస్తున్నారు. ఆకర్షణీయమైన రూపంతో పాటు చక్కటి వ్యక్తిత్వం త్రిధాను ఇండస్ట్రీలో ప్రత్యేకంగా నిలబెడుతోంది. 2026లో త్రిధా చౌదరి పలు క్రేజీ ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. బాలీవుడ్, టాలీవుడ్, బెంగాలీ పరిశ్రమలలో దూసుకుపోతున్న ఈ భామ గతంలో ఆశ్రమ్, బందిష్ బండిట్స్ వంటి సూపర్ హిట్ వెబ్ సిరీస్‌లతో సంచలనం సృష్టించారు.

# ఆ హీరో ఎనర్జీ నెక్స్ట్ లెవల్.. రాశీ ఖన్నా క్రేజీ కామెంట్స్

టాలీవుడ్ ముద్దుగుమ్మ రాశీ ఖన్నా వరుస సినిమాలతో దూసుకుపోతూ ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటారు. 'తెలుసు కదా', 'ఉస్తాద్ భగత్ సింగ్' వంటి చిత్రాలతో పాటు రీసెంట్‌గా 'లుక్కే' వెబ్ సిరీస్‌తో అలరించిన ఈ భామ, తాజాగా ఓ ఇంటర్వ్యూలో టాలీవుడ్ స్టార్ హీరోలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా జూనియర్ ఎన్టీఆర్‌తో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ ఆమె చేసిన కామెంట్లు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ విశేషాలేంటో ఇప్పుడు చూద్దాం. ఎన్టీఆర్ ఎనర్జీకి ఫిదా అయిన రాశీ: జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన బ్లాక్‌బస్టర్ సినిమా 'జై లవకుశ'లో రాశీ ఖన్నా ఒక హీరోయిన్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా షూటింగ్ రోజులను గుర్తుచేసుకుంటూ ఆమె ఎన్టీఆర్ పై ప్రశంసల జల్లు కురిపించారు. "ఎన్టీఆర్ యాక్టింగ్ విషయంలో చాలా ఫ్యాషన్‌గా ఉంటారు. ఇక అతనిలో ఉన్న ఎనర్జీని నేను ఎక్కడా చూడలేదు, ఎన్టీఆర్ అంత ఎనర్జీటిక్‌గా ఎవరూ ఉండలేరు" అంటూ ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్టీఆర్ ఎనర్జీ లెవెల్స్ చూసి ఆశ్చర్యపోయిన రాశీ ఖన్నా, సరదాగా ఆయనను ఒక ప్రశ్న అడిగారట. షూటింగ్ సమయంలో ఆయనను చూసి "మీరు ఎప్పుడూ ఇలాగే ఉంటారు కదా.. అసలు మీరు ఏదైనా ఎనర్జీ డ్రింక్ తాగుతారా?" అని సరదాగా అడిగానని ఆమె నవ్వుతూ పంచుకున్నారు. ఆయన సెట్స్‌లో చూపించే ఉత్సాహం తోటి నటీనటులకు కూడా ఎంతో స్ఫూర్తి నిస్తుందని ఆమె మనసారా కొనియాడారు. పది పేజీల డైలాగ్స్ అలవోకగా: ఎన్టీఆర్ టాలెంట్ గురించి చెబుతూ ఆయన డైలాగ్ డెలివరీపై ప్రశంసలు కురిపించారు. పది పేజీల సుదీర్ఘమైన డైలాగ్స్‌ను సైతం ఆయన ఎలాంటి ఇబ్బంది లేకుండా అలవోకగా చెప్పేస్తారని తెలిపారు. అంతేకాకుండా తెలుగులో ఆయన స్పష్టంగా, చాలా చక్కగా మాట్లాడతారని, ఆయన డైలాగ్ డెలివరీ శైలి తనకు ఎంతగానో నచ్చుతుందని రాశీ ఖన్నా చెప్పుకొచ్చారు. ఆయనతో పనిచేయడం తనకు ఎంతో మంచి అనుభవాన్ని ఇచ్చిందని తెలిపారు.



# పెళ్లిపై నిధి అగర్వాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్!



టాలీవుడ్ గ్లామర్ బ్యూటీ నిధి అగర్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ అమ్మడు తాజాగా తన పర్సనల్ లైఫ్ గురించి, పెళ్లి విషయాలపై ఆసక్తికరమైన కామెంట్లు చేసి నెట్టింట హాట్ టాపిక్‌గా మారారు. అసలు ఆమె తెలుగబ్బాయితో పెళ్లి గురించి ఏమన్నారు? హైదరాబాద్ షిఫ్టింగ్ ముచ్చట్లు ఏంటో తెలిపారు..ఆ వివరాలు చూద్దాం.. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో పాల్గొన్న నిధి అగర్వాల్ మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా తన మూలాల గురించి మాట్లాడుతూ ఆసక్తికర విషయం చెప్పారు. తాను ఎక్కడో పుట్టి పెరిగింది కాదని, అసలుసిసలు హైదరాబాద్‌లోనే పుట్టానని స్పష్టం చేశారు. ఇక ఆ లెక్కన తాను బై బర్త్ పక్కా తెలుగమ్మాయినేనని గర్వంగా చెప్పుకొచ్చారు. తెలుగు నేలతో తనకు ఉన్న అనుబంధాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఇంటర్వ్యూలో భాగంగా రిపోర్టర్ అడిగిన ఒక ప్రశ్నకు నిధి ఇచ్చిన సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "మీరు తెలుగబ్బాయిని పెళ్లి చేసుకుంటారా?" అని ఒకరు అడగగా, ఆమె నవ్వుతూ "అది ఇప్పుడే చెప్పలేం.. మే బీ చేసుకోవచ్చు" అంటూ క్యూట్ ఆన్సర్ ఇచ్చారు. ఆమె చెప్పిన ఈ సమాధానం చూసి అభిమానులు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. మన టాలీవుడ్ కుర్రకారుకు ఇది ఖచ్చితంగా గుడ్ న్యూసే కదా.. కేవలం సినిమాల కోసమే కాకుండా, పూర్తిగా నగరంతో కనెక్ట్ కావడానికి ఈ ఏడాదే తాను ముంబై నుంచి హైదరాబాద్‌కు శాశ్వతంగా షిఫ్ట్ అయ్యానని నిధి తెలిపారు. ఇక ఇక్కడి కల్చరల్ సెలబ్రేషన్స్ అంటే తనకు చాలా ఇష్టమని, ఈసారి ఎంతో ఘనంగా జరిగే బతుకమ్మ వేడుకల్లో కూడా తాను స్వయంగా పాల్గొనబోతున్నానని ఆమె ఆనందంగా పంచుకున్నారు. వరుస క్రేజీ ప్రాజెక్ట్స్‌తో బిజీ: మరోవైపు సినిమాల పరంగానూ నిధి అగర్వాల్ ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్' చిత్రంలో నటించి అలరించిన ఆమె, ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో ఓ శక్తిమంతమైన మైథలాజికల్ థ్రిల్లర్ చేస్తున్నట్లు నిర్మాత సునీత్ పడోల్కర్ తెలిపారు.

## అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన చెస్ క్రీడాకారిణి శివాంశికను అభినందనలు

హైదరాబాద్ : జమ్మూలో నిర్వహించిన అండర్-17 జాతీయ స్థాయి చెస్ పోటీల్లో రజత పతకం సాధించి, వరల్డ్ యూత్ కామన్వెల్త్ పోటీలకు ఎంపికైన చిఱఓ, చిఱఓ టైటిల్ హోల్డర్ శివాంశికను మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్లోని మినిస్టర్ క్వార్టర్స్లో అభినందించి సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ చిన్న వయసులోనే చెస్లో అసాధారణ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రజత పతకం సాధించడం ఎంతో అభినందనీయం. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం మన రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో శివాంశిక మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. తన ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించి, మరెందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

## పట్టా భూమిలోనైనా టేకు నరికివేత, రవాణాకు అనుమతి తప్పనిసరి

గోకవరం : గోకవరం మండలం ఇటుకాయలపల్లి గ్రామ పరిధిలో భారీగా టేకు చెట్ల అక్రమ నరికివేత వెలుగులోకి వచ్చింది. గ్రామ శివారులోని ఆంజనేయస్వామి గుడి దగ్గరనుంచి గోపాలపురం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ఒక మామిడి తోటలో సుమారు 30 ఏళ్ల వయస్సు గల 30 టేకుచెట్లను దుండగులు అక్రమంగా నరికి తరలించారు.చెట్లు ఉన్నది పట్టా భూమిలోనే అయినప్పటికీ, టేకు వంటి రక్షిత (రిజర్వుడ్) జాతి చెట్లను నరకాలన్నా లేదా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించాలన్నా అటవీ శాఖ నుంచి 'ట్రాన్సిట్ పర్మిషన్' (రవాణా అనుమతి) పొందడం చట్టరీత్యా తప్పనిసరి. అలాగే రెవెన్యూ శాఖ నుంచి కూడా ముందస్తు అనుమతి ఉండాలి.అయితే,ఎలాంటి అనుమతులులేకుండా యంత్రాల సహాయంతో చెట్లను నరికి లారీల్లో తరలించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పట్టా భూమి నెపంతో కొందరు అక్రమార్కులు చెట్లను నరికి వ్యాపారం చేస్తున్నారని, ఈ అక్రమ రవాణా వెనుక కోరుకొండకు చెందిన 'కుర్మా' అనే కలప వ్యాపారి హస్తం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయల విలువైన టేకు దుంగలను విక్రయించేందుకే పథకం ప్రకారం ఈ దందా సాగించారని అంటున్నారు.ఈ ఘటనపై సంబంధిత ఫారెస్ట్ గార్డును వివరణ కోరగా..."మరొక ప్రాంతంలో పులిసంచారం ఉందనే సమాచారంతో అక్కడ విధుల్లో ఉన్నాను, ఈ విషయం నా దృష్టికి రాలేదు" అని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టపగలే 30 టేకు చెట్లను నరికి తరలిస్తుంటే అధికారులకు సమాచారం లేకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.అటవీ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లను నరికి తరలించిన బాధ్యులపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములను వసూలు చేయాలని పలువురు కోరుతున్నారు

## ఎస్సీ రోస్టర్లో గ్రూప్-1 కులాలకు అన్యాయం

### - గ్రూప్-1 కులాలకు రెండో రోస్టర్ పాయింట్ కేటాయించాలి
### - 57 ఎంబీఎస్సీ కులాల రౌండ్టేబుల్ సమావేశంలో మేధావుల డిమాండ్



హైదరాబాద్: 10 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్ల కేటాయింపులో గ్రూప్-1 కులాలకు అన్యాయం జరుగుతోందని,వెంటనే రోస్టర్ విధానాన్ని సవరించి గ్రూప్-1 కులాలకు రెండో రోస్టర్ పాయింట్ కేటాయించాలని 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు.సోమాజిగూడ ప్రెస్క్లబ్లో సోమవారం నిర్వహించిన రౌండ్టేబుల్ సమావేశంలో పలువురు మేధావులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని ఎస్సీ రిజర్వేషన్ల రోస్టర్ పాయింట్ల కేటాయింపుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా దక్షిణ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా జరిగిందని ఆరోపించారు.గ్రూప్-1 కులాలకు రెండో రోస్టర్ పాయింట్, గ్రూప్-3 కులాలకు 16వ రోస్టర్ పాయింట్ కేటాయించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు.రోస్టర్ పాయింట్ల సవరణ విషయంలో దళిత మంత్రులు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.అగ్రవర్ణ పేదల జేఏసీ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్రెడ్డి మాట్లాడుతూ 57 ఎంబీఎస్సీ కులాలకు కుల ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలోనూ ప్రభుత్వం వివక్ష చూపడం దారుణమన్నారు.ఆయా కులాలకు న్యాయం జరిగే వరకు వారి పోరాటానికి అండగా ఉంటామని ప్రకటించారు.మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ మాట్లాడుతూ రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాలలతో పాటు 57 కులాలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.రోస్టర్ విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయడంతో పాటు ఎస్సీ ఉపకులాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రొఫెసర్ అన్వర్ఖాన్, పీసీసీ మహిళా నేత జీవనజ్యోతి తదితర మేధావులు సమావేశానికి సంపూర్ణ మద్దతు ప్రకటించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో 57 ఎంబీఎస్సీ కులాల నాయకులు ఉపదే సనధన్, కర్నె రామారావు, బత్తుల పాండు,మన్నె సుధాకర్, శాఖమూరి యాదగిరి,కురువ బాలరాజు,మఠపతి నాగయ్యస్వామి, అంతోని సురేష్, గడ్డం విష్ణు,కొలుపుల రాఘవులు,దుర్గం నగేష్, బొబ్బిలి రమేష్,రాజేందర్, కొండ్లేపు అర్జున్,గడ్డం చిరంజీవి, వేణు మాష్టి తదితరులు పాల్గొన్నారు.



## ప్రగతి కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**పూల పండుగలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు**

గజ్వేల్: అక్టోబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి):


తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గజ్వేల్ పట్టణంలోని ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం




నెలకొంది.విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అంబదాస్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పూల పండుగ అని అన్నారు.ప్రకృతిని ఆరాధిస్తూ,పూలను పూజిస్తూ ఆడపడుచులంతా ఒక్కచోట చేరి ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేక విశిష్టత ఉందన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ మెట్టయ్య చౌదరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన బతుకమ్మ పండుగకు ప్రజల జీవితాల్లో ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కాపాడుతూ, తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు పరిచయం చేయడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.విద్యతో పాటు సంస్కృతి,సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండటం విద్యార్థులకు ఎంతో అవసరమని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు.ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు వాటి పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు వరలక్ష్మి,సంతోషి, కల్పన, భవాని,ఆస్మా ఖానం,అధ్యాపకులు భాస్కర్రెడ్డి,విక్షవతి,అనిల్,కృష్ణ, కనకరాజు,మహిపాల్,సాయినాథ్, భానుచందర్,దివాకర్తో పాటు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## మౌలాలి సర్కిల్లో అరకొర ఏర్పాట్లతో ఎంగిలిపూల బతుకమ్మ

### - రూ.45 లక్షల టెండర్లపై అనుమానాలు.. సఫిల్గూడ, బండ చెరువు వద్ద కనీస సౌకర్యాల కొరత
### - తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై మహిళలు, స్థానికుల ఆగ్రహం



మల్కాజిగిరి,
అక్టోబరు 10 (ప్రజా కలం ప్రతినిధి):

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మౌలాలి సర్కిల్లో ఎంగిలిపూల బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పండుగను ఘనంగా నిర్వహించేందుకు సుమారు రూ.45 లక్షల విలువైన టెండర్లు పిలిచినట్లు సమాచారం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు తగ్గ ఏర్పాట్లు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సఫిల్గూడ, బండ చెరువు ప్రాంతాల్లో ఏర్పాట్లు అరకొరగా ఉండటంపై మహిళలు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**కనీస సౌకర్యాలేవీ?**

బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు మహిళలు, చిన్నారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వారికి అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండుగ కోసం నిధులు కేటాయించినప్పుడు, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

**రూ.45 లక్షల టెండర్లపై సందేహాలు**

బతుకమ్మ పండుగ ఏర్పాట్ల కోసం సుమారు రూ.45 లక్షల విలువైన టెండర్లు పిలిచినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఆ నిధులను ఏయే పనులకు కేటాయించారు? టెండర్లలో పేర్కొన్న పనులన్నీ పూర్తయ్యాయా? క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులకు, చేసిన ఖర్చులకు పొంతన ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంట్రాక్టర్లు చేపట్టిన పనుల నాణ్యతను సంబంధిత అధికారులు సక్రమంగా పర్యవేక్షించారా? అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అయితే, నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ



కావాల్సి ఉంది.

**పండుగ ముగిసే వేళ లైటింగ్ ఏర్పాట్లా?**

బతుకమ్మ వేడుకల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యానికి ఏర్పాట్ల తీరే నిదర్శనమని మహిళలు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ ముగిసే సమయంలో లైట్లు ఏర్పాటు చేయడం, జీహెచ్ఎంసీ సిబ్బంది పండుగ అనంతరం కాగితపు బతుకమ్మలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడం వంటి పరిణామాలు అధికారుల వనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు చివరి నిమిషంలో హడావుడి చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని విమర్శిస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

బతుకమ్మ పండుగ పేరుతో ప్రజాధనం వృథా కాకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. టెండర్ల వివరాలు, పనుల అంచనా వ్యయం, వాస్తవంగా చేపట్టిన పనులు, చేసిన ఖర్చులపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. సఫిల్గూడ, బండ చెరువు ప్రాంతాల్లో తాగునీరు, లైటింగ్తో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. టెండర్ల అమలు, పనుల నాణ్యత, నిధుల వినియోగంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ల వివరణ అందుబాటులోకి రావాల్సి ఉంది.

## పేటలో వివాహిత అనుమానాస్పద మృతి

చిలకలూరిపేట : పట్టణంలోని మద్ది నగర్ ఒకటో లైన్లో నివాసం ఉంటున్న అమీనా అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆమె భర్త ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ సూపర్వైజర్గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి వివాహమై సుమారు 25 సంవత్సరాలు కాగా, కుమారుడు ఉద్యోగరీత్యా విదేశాల్లో ఉన్నట్లు సమాచారం.భర్త తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం అమీనా ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి, ఇంజెక్షన్ ఇప్పించిన అనంతరం ఇంటి వద్ద వదిలి తాను విధులకు వెళ్లినట్లు పేర్కొన్నారు. తిరిగి ఇంటికి వెళ్లే సమయానికి ఆమె ఉరివేసుకున్న స్థితిలో కనిపించినట్లు తెలిపారు.అయితే, అమీనా మృతిపై ఆమె తరఫు బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్ల వైవాహిక జీవితంలో ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదని, ఇప్పుడు ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందని భర్తను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. అలాగే, ఆమె భర్తకు రెండో భార్య ఉన్నట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సోమేశ్వరరావు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. అమీనా మృతికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## యువతకు హెల్మెట్లు పంపిణీ

ఖైరతాబాద్ : యువత రోడ్డు నియమాలు పాటించాలని బంగారు భవిష్యత్ను రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతూ నాశనం చేసుకోవద్దని ఖైరతాబాద్ నియోజక వర్గం సీనియర్ నేత, భాగ్యనగర్ ఉత్సవ సమితి కార్యదర్శి పల్లపు గోవర్ధన్ అన్నారు శుక్రవారం ఫిలింనగర్లో 'డ్రైవ్ సేఫ్ బీ సేఫ్' అంటూ యువతకు ట్రాఫిక్ రూల్స్పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మంది యువతకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమాలు పాటించాలని ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నడిపడంతో పాటు తాగి వాహనాలు నడపడం వల్ల మన ప్రాణాలతో పాటు అవతలి వారి ప్రాణాలకు కూడా ముప్పు ఉంటుందని అన్నారు.

## ఎస్ఐఆర్ను వెంటనే రద్దు చేయాలి

### ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్కుమార్ను పదవి నుంచి తొలగించాలి
### ఢిల్లీలో నిర్బంధాలను ఆపాలి.. ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకుల డిమాండ్




గజ్వేల్: అక్టోబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి):

ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ) ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని,కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్కుమార్ను పదవి నుంచి తొలగించాలని ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్కు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలు తెలిపేవారిపై నిర్బంధాలను ఆపాలని కోరారు.ఈ మేరకు డాక్టర్ చిప్పల యాదగిరి అధ్యక్షతన గజ్వేల్ అంబేద్కర్ భవన్లో రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఓటరు హక్కులకు భంగం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని మార్చి, తనకు అనుకూలమైన వ్యక్తులను ప్రధాన ఎన్నికల కమిషనర్గా నియమిస్తోందని విమర్శించారు. దీనివల్ల రాజ్యాంగ,ప్రజాస్వామ్య వ్యవస్థలకు నష్టం కలుగుతోందని ఆరోపించారు.గతంలో ఓటు హక్కును వినియోగించుకున్నవారి పేర్లను సైతం ఓటరు జాబితా నుంచి తొలగించడం ఆందోళనకరమని అన్నారు. బతికున్నవారి పేర్లు తొలగించడంతో పాటు,తిరిగి ఓటు నమోదు చేసుకోవడానికి అనేక పత్రాలు సమర్పించాలని కోరుతూ ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడం ఇబ్బందులకు గురిచేయడమేనని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ, బలహీన వర్గాల ఓట్ల తొలగింపునకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఆరోపించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపే వారిపై అప్రకటిత నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదని నాయకులు అన్నారు. ప్రజాస్వామ్యవాదులు ఈ చర్యలను ఖండించాలని,రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్,మతిన్, సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య,బిఆర్ఎస్ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా,సీఐటీయూ నాయకుడు రంగారెడ్డి,మొనగారి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బీఎస్పీ జిల్లా కార్యదర్శి కొండనుల్ల నరేష్,బీఎస్పీ అసెంబ్లీ ఇన్చార్జి వినోద్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్,వంశీ, మాల మహానాడు నాయకులు కప్ప భాస్కర్,గాలింక శ్రీనివాస్,తిగుల్ నరేష్,గంట శ్రీధర్,బయ్యారం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు

**- అక్టోబర్ 11 నుండి 20 వరకు అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు**

**- శ్రీ శివ గంగా ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్**

మహేశ్వరం, అక్టోబర్ 10,(ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ శివగంగ రాజరాజేశ్వరి రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ శ్రీ శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ ఆదివారం నుండి 20వ తేదీ మంగళవారం వరకు 10 రోజుల పాటు శ్రీ అమ్మవారి



దివ్య అలంకారములు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 11న ఆదివారం – శ్రీ బాలా త్రిపురసుందరి దేవి,12న సోమవారం శ్రీ గాయత్రీ దేవి,13 న మంగళవారం శ్రీ అన్నపూర్ణా దేవి,14 న బుధవారం శ్రీ మహాచండీ దేవి,15న గురువారం శ్రీ లలిత త్రిపుర సుందరిదేవి,16న శుక్రవారం శ్రీ సరస్వతీ దేవి,17-10-2026 శనివారం, శ్రీ మహాలక్ష్మీ దేవి,18న ఆదివారం శ్రీ దుర్గా దేవి, 19న సోమవారం శ్రీ మహిషాసురమర్దిని, 20న మంగళవారం శ్రీ రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిస్తారని తెలిపారు.ఈ సందర్భంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకములు, కుంకుమార్చనలు జరుగుతాయని తెలిపారు.దాతలు ఒక రోజు అలంకరణకు రూ. 15,000 వేలు , ఒక రోజు అన్నదానమునకు రూ. 25,000 వేలు సమర్పించవచ్చని తెలిపారు. విరాళాలు అందించదలచిన భక్తులు టెంపుల్ బ్యాంకు అకౌంట్ నంబర్ . 62020620917, ఎస్ బి ఐ , మహేశ్వరం బ్రాంచ్ ఖాతాలో జమ చేయవచ్చని, అలాగే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా చెల్లించవచ్చని సూచించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని దేవాలయ అభివృద్ధి కమిటీ కోరింది.

## ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌లో భాగంగా నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌కు అపూర్వ స్పందన.

**-జిల్లా వ్యాప్తంగా 1,485 మంది అభ్యర్థులు హాజరు.. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,**

సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 10( ప్రజా కలం):

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రాతిక్ జైన్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు అందించనున్న ఉచిత కోచింగ్‌లో భాగంగా ఈరోజు నిర్వహించిన



స్క్రీనింగ్ టెస్ట్ ప్రశాంతంగా ముగిసింది. పోలీసు ఉద్యోగాల సాధనే లక్ష్యంగా ఉత్సాహంతో సిద్ధమవుతున్న అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించిందని, జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాలలో సంగారెడ్డి: 765, అందోల్: 265, జహీరాబాద్: 455 మొత్తం 1,485 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన, పోలీసు ఉద్యోగాలకు అవసరమైన శారీరక శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు.అర్హులైన అభ్యర్థులకు పోలీసు ఉద్యోగాల సాధనలో తగిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించడమే ఈ ఉచిత కోచింగ్ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి తమ లక్ష్యాలను సాధించాలన్నారు.

## నేర సమీక్ష సమావేశంలో పోలీసు అధికారులకు ఎస్పీ డి. సునిత రెడ్డి ఆదేశాలు

వనపర్తి : వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి. సునిత రెడ్డి, ఐపీఎస్ గారు నేర సమీక్ష సమావేశం నిర్వహించి, జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం మరియు పోలీసు సేవల మెరుగుదలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఎఫ్ఐఆర్‌ను ఈ-సాక్ష్య విధానంలో నమోదు చేసి, సంబంధిత ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు, బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం 60 రోజులు, 90 రోజుల గడువులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఆన్‌లైన్‌లో నమోదయ్యే ఎఫ్ఐఆర్‌లు, జీరో ఎఫ్ఐఆర్‌ల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. టీజీ కాప్, హెచ్ఆర్ఎంఎస్, సీఈఐఆర్ పోర్టల్‌లను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు విధులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ఇన్వెస్టిగేషన్‌లో టెక్నాలజీ వినియోగాన్ని పెంచి, నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు.డయల్-112 ద్వారా అందే అత్యవసర ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు సకాలంలో సహాయం అందించాలని తెలిపారు. నాట్‌గ్రిడ్ వ్యవస్థను నిబంధనల ప్రకారం వినియోగిస్తూ, సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం పెంపొందించాలని సూచించారు. ఈ-పెట్టీ కేసులు, ఐటీ యాక్ట్ సంబంధిత కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పెండింగ్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.




# ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో బతుకమ్మ వేడుకలు

**- విద్యార్థినులతో కలిసి సందడి చేసిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 10,(ప్రజా కలం):

తెలంగాణ సాంస్కృతిక ప్రతీక, ఆడపడుచుల ఆత్మగౌరవ వేడుక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని చారిత్రాత్మక ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మహిళలు, కాంగ్రెస్ నాయకులు మరియు విద్యార్థినులతో కలిసి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ, సాంస్కృతిక పాటలు పాడుతూ ఆడుతూ సందడి చేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణమంతా బతుకమ్మ పాటలతో, మహిళల కేరింతలతో పండుగ శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా పారిజాత నరసింహారెడ్డి గారు మాట్లాడుతూ – తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తోందని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థినులతో కలిసి ఇంతటి వేడుక జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎన్ఎస్‌యూఐ నాయకులు, మహిళలు, యువతీ యువకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## కందుకూరు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కందుకూరు గ్రామ సర్పంచ్ సరికొండ పాండు

కందుకూరు, అక్టోబర్ 10, (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రమైన కందుకూరు గ్రామంలో గురువారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఘనంగా జరిగింది. హెచ్ఎండిఏ నిధుల నుండి మంజూరైన రూ. 30 లక్షల వ్యయంతో గ్రామంలో కొత్తగా చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలో చాలా కాలంగా రోడ్లు అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో హెచ్ఎండిఏ నిధులతో సీసీ రోడ్లు మంజూరు కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామంలో రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, ముఖ్యంగా వర్షాకాలంలో బురద రోడ్ల సమస్య తొలగిపోతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ సరికొండ పాండు, ఉప సర్పంచ్ సౌడపు మమత వెంకటేష్ గౌడ్ హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ – గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని, హెచ్ఎండిఏ నిధులతో మొదటి విడతగా 30 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉమాకాంత్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రమేష్, నర్సింహ్మ, కార్తీక్, రవీందర్ మరియు గ్రామ పెద్దలు వెంకటేష్, సుదర్శన్, జంగాచారి, అనిల్ రెడ్డి, జగన్, శ్రీశైలం, కృష్ణ, శ్రీను, నవీన్, ఫయాజ్, యాదగిరి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లింగం, రాజశేఖర్ తో పాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహేశ్వరంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు**

**బతుకమ్మ పాటలతో మార్మోగిన ఆలయం**

**మహేశ్వరం, అక్టోబర్ 10, (ప్రజా కలం ):**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు మహేశ్వరం మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి.మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున చేరుకుని ఎంగిలిపూల బతుకమ్మను సంబరంగా జరుపుకున్నారు.

తెల్లవారుజాము నుంచే సందడి :బతుకమ్మ పండుగ తొలిరోజు కావడంతో తెల్లవారుజాము నుంచే మహిళలు రకరకాల పూలను సేకరించి త్రికోణాకారంలో అందంగా బతుకమ్మలను పేర్చారు. గుమ్మడి, తంగేడు, బంతి, చామంతి పూలతో పేర్చిన బతుకమ్మలు కనువిందు చేశాయి. ఆలయ ప్రాంగణంలో వలయాకారంలో నిలబడి “ఎంగిలిపూల బతుకమ్మా ఎంగిలిపూలే... ఎములాడ రాజన్నా ఎంగిలిపూలే” అంటూ సాంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆడిపాడారు.ఆడబిడ్డల కోలాహలం, పూల సోయగాలు, బతుకమ్మ పాటలతో రాజరాజేశ్వరి





ఆలయ ప్రాంగణం మొత్తం సందడిగా మారింది. చిన్నారుల నుండి పెద్దల వరకు అందరూ ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ – తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రతి ఏటా శివగంగ ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ప్రతి రోజు మహిళలు అమ్మవారి నన్నిధిలో బతుకమ్మ ఆడటం ఆనవాయితీగా వస్తోందన్నారు.అనంతరం మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. చివరగా సంప్రదాయబద్ధంగా బతుకమ్మను ఆలయ కోనేరులో నిమజ్జనం చేశారు. వేడుకలకు వచ్చిన మహిళలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలి.!

**కలెక్టర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సంగారెడ్డి జర్నలిస్టులు, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి**

**జర్నలిస్టుల ఆకాంక్షలు నెరవేర్చాలని కోరారు.**

సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 10 ( ప్రజా కలం):

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలని టి యు డబ్ల్యూ జే (ఐ జేయు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆకాంక్షించారు. పేద బడుగు వర్గాల తో పాటు జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. టియుడబ్ల్యుజే – ఐజేయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను జర్నలిస్టులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుస్తకాలు, పెన్నులు అంద జేశారు. కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఏ అండ దండా లేని పేద ప్రజలకు పెద్దదిక్కుగా ఉండాలని కోరారు. అందుకు తగిన ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లాలో జర్నలిస్టులకు తోడుగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని పేర్కొన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ మనస్ఫూర్తిగా స్పందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మతిన్, సీనియర్ జర్నలిస్టు మసూద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, జర్నలిస్టులు సూర్య వెంకట్, దినేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవ మండపాలను పరిశీలించిన మల్కాజిగిరి పోలీసులు

**మల్కాజిగిరి, అక్టోబరు 10 (ప్రజా కలం ప్రతినిధి):**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సంతోష్‌నగర్‌లోని అంబాభవాని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవ మండపాన్ని



మల్కాజిగిరి సీఐ విజయ్ కుమార్, ఎస్సై శ్రీనివాసులు పరిశీలించారు. మండపం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు పూర్తి సహకారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ పరిశీలనలో పోలీసు సిబ్బంది, ఉత్సవ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకోవాలి: కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్**

గజ్వేల్:10 అక్టోబర్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను గజ్వేల్ పట్టణంలోని చారిత్రక పాండవుల చెరువు వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో 14వ వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్‌తో పాటు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆనందానికి ప్రతీక అని అన్నారు.తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను జరుపుకోవాలని సూచించారు.తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే బతుకమ్మ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడం సంతోషకరమని పేర్కొన్నారు.పాండవుల చెరువు వద్ద మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి,వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడారు.కోలాటాలతో సందడి చేస్తూ పండుగ ఆనందాన్ని పంచు కున్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో,సిరిసంపదలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కౌన్సిలర్ తెలిపారు.





# గ్రామ ప్రజల సమస్యకు తక్షణ పరిష్కారం

## మరుసటి రోజే పైప్‌లైన్ పనులు పూర్తి చేసిన సర్పంచ్

**బీబీనగర్, అక్టోబర్ 10(ప్రజాకలం):**

మండలంలోని మగ్ధంపల్లి గ్రామ ఎస్సీ, బీసీ కాలనీల్లో దెబ్బతిన్న నీటి పైప్‌లైన్ సమస్యకు సర్పంచ్ శిగ నరేష్‌గౌడ్ తక్షణ పరిష్కారం చూపారు. పైప్‌లైన్ దెబ్బతినడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు గురువారం ఈ విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన కొత్త పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. శుక్రవారం పనుల వద్ద ఉండి వాటిని పర్యవేక్షించి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శిగ నరేష్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో నీటి సరఫరాకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.సమస్య చెప్పిన మరుసటి రోజే పైప్‌లైన్ పనులు పూర్తికావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రగతి నగర్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

## -ఆటపాటలతో సందడి చేసిన మహిళలు, చిన్నారులు

## -అపార్ట్‌మెంట్లు, కూడళ్లలో వెల్లివిరిసిన పండుగ శోభ

**నిజాంపేట్, అక్టోబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.




తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకైన పూల పండుగ మొదటి రోజు కావడంతో స్థానిక కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు పండుగ శోభతో కళకళలాడాయి. మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను తీర్చిదిద్దారు. ఇళ్ల ముంగిట, అపార్ట్‌మెంట్ ప్రాంగణాల్లో, కాలనీ కూడళ్లలో ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్ల వద్ద గౌరమ్మను భక్తిశ్రద్ధలతో కొలిచారు. బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ, 'రామ రామ ఉయ్యాల..', 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల..' అంటూ లయబద్ధంగా సాగిన కోలాటాలు, జానపద గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల కేరింతలు, మహిళల సందడితో ప్రగతి నగర్ పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక, ఆహ్లాదకర వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

## -ఎంగిలిపూల బతుకమ్మలో మహిళలతో కలిసి పాల్గొన్న గోలి ప్రణీత పింగల్‌రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 10 (ప్రజాకలం): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యాయి. బీబీనగర్ మండల కేంద్రంలో మహిళలు పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు, మాజీ జడ్పీటీసీ గోలి ప్రణీత పింగల్‌రెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ ఆడపడుచులంతా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని నింపాయి.



# రోడ్డు మధ్యలో చెట్లు-వాహనదారులకు అవస్థలు

## రామంతాపూర్ కేసిఆర్ నగర్ ప్రధాన రహదారిలో నడి రోడ్డులో చెట్లు పట్టించుకోని పాలకులు -అధికారులు

## అటవీశాఖ అధికారులు సమస్యకు పరిష్కార మార్గం చూపాలంటున్న స్థానికులు

**ఉప్పల్ అక్టోబర్ 10(ప్రజాకలం న్యూస్)**

రామంతాపూర్ కేసిఆర్ నగర్ ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఉండాల్సిన చెట్లు, ఇక్కడ ఏకంగా నడిరోడ్డుపైనే పెరిగి పెద్దవవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.రాత్రి వేళల్లో మలుపుల వద్ద ఈ చెట్లు వాహన దారులకు సరిగ్గా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థాని కులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిపై అధికారులు నిర్లక్ష్యం వహిం చడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పట్టించుకోని పాలకులు, అధికారులు

ఈ సమస్యపై స్థానిక ప్రజలు, వాహనదారులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు. సమస్య తీవ్రతను తెలిసి కూడా పాలకులు, మున్సిపల్ అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అటవీశాఖ చొరవ చూపాలి!**

రోడ్డు మధ్యలో ఉన్న ఈ చెట్ల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని భయపడుతున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, రోడ్డు మధ్యలో ఉన్న చెట్లను తొలగించి లేదా ఇతర ప్రాంతాలకు మార్చడం (ట్రాన్స్‌ప్లాంటేషన్) ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రామంతాపూర్, కేసిఆర్ నగర్ స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.





# ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో ఘనంగా ఫ్రెషర్స్ డే బతుకమ్మ సంబరాలు

## - మహేశ్వరం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సంగి రమేశ్

**మహేశ్వరం, అక్టోబర్ 09 (ప్రజా కలం):**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరంలో ఫ్రెషర్స్ డే, బతుకమ్మ ఉత్సవాలను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సంగి రమేశ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నూతన విద్యార్థినీ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలకడం ప్రతి కళాశాలలో కొనసాగుతున్న సంప్రదాయమని, దీని ద్వారా అందరూ కలిసిమెలిసి కళాశాల విద్యా సముదాయాన్ని పటిష్టంగా నిర్మిస్తారని అన్నారు. సీనియర్స్ అనుభవాలను, అధ్యాపక బృందం గురించిన విషయాలను తెలుసుకుని చదువులో ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన బతుకమ్మ వేడుకల్లో ప్రిన్సిపల్ అధ్యాపక బృందంతో పాటు విద్యార్థినీ విద్యార్థులతో కలిసి బతుకమ్మ పాటకు లయబద్ధంగా నృత్యం చేశారు. బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేస్తూ – బతుకమ్మ ప్రపంచంలోనే అరుదైన పండుగని, తెలంగాణకు ప్రత్యేక పూల పండగని, స్త్రీలు పూలతో అందంగా అమర్చిన బతుకమ్మలను గౌరమ్మ రూపంగా పూజించి జరుపుకుంటారని, ఈ పండుగను ప్రకృతిని, భూమిని, స్త్రీత్వాన్ని ఆరాధిస్తూ తొమ్మిది రోజులపాటు ఘనంగా జరుపుకుంటారని తెలియజేశారు.ఈ సందర్భంగా బతుకమ్మ పోటీలు నిర్వహించి అత్యంత అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ మరియు డాక్టర్ శ్రీహరి రెడ్డి, అధ్యాపకులు శ్రీదేవి, చిన్నోజి, డాక్టర్ జహీదాబేగం, నరేందర్ రెడ్డి, డాక్టర్ గోపాల్, కుమార్, శిరీష, సునీత, ప్రవళిక, స్నేహ, రమేష్, సుమతి, సన్నీ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# అంబేడ్కర్ వారసత్వాన్ని కొనసాగించిన యోధుడు కాన్షీరామ్

## - బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్

## - బడంగ్‌పేట్‌లో ఘనంగా కాన్షీరామ్ వర్ధంతి సభ

## - బహుజన రాజ్యాధికారమే లక్ష్యమని పిలుపు



**మహేశ్వరం, అక్టోబర్ 10, (ప్రజా కలం):**

అనేక సంవత్సరాలుగా మానవ హక్కులకు దూరంగా ఉంచబడిన పీడిత జనులను విముక్తి చేయడానికి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ తన జీవితం చివరి వరకు కృషి చేస్తే, ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకుని మరణించే వరకు అందుకోసం పోరాడిన గొప్ప యోధుడు కాన్షీరామ్ అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్ అన్నారు. కాన్షీరామ్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని సిరిపురం యాదయ్య ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన బహుజన రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభలో ఆయన బీఎస్పీ స్టేట్ అండ్ సెంట్రల్ మాజీ ఎమ్మెల్సీ అతార్ సింగ్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇబ్రహీం శేఖర్ మాట్లాడుతూ భారతదేశంలో అనాదిగా కొనసాగుతున్న సాంఘిక అసమానతలు, అంటరానితనం, కుల పీడన, మత ఘర్షణలు, శూద్ర, అతిశూద్రుల పేరున అణచివేత, పేదరికంతో ప్రజలు హింసించ బడుతున్న వేళ అనేక వివక్షలకు దారి తీసిన నేపథ్యంలో, బానిస విముక్తి నుంచి అక్షరాస్యత వైపు నడిపిన మహాత్మా జ్యోతిరావు ఫూలే, ఛత్రపతి సాహు మహారాజ్, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, నారాయణగురు, పెరియర్, భాగ్యరెడ్డి వర్మ లాంటి ఉద్యమకారుల ఉద్యమాల వల్ల దేశంలో ఎన్నో చారిత్రాత్మక మార్పులు వచ్చాయన్నారు. బహుజన మహాత్ముల బాటలో నడిచి భారతదేశ చరిత్రలో మరో చారిత్రక మలుపు తిప్పిన గొప్ప నాయకుడు మాన్యశ్రీ కాన్షీరామ్ అని కొనియాడారు. బహుజన లోకం ఒక్కటైతే రాజ్యాధికారం అనివార్యమని బహుజన సమాజ్ పార్టీ స్థాపన ద్వారా నిరూపించిన ఏకైక వ్యక్తి కాన్షీరామ్ మాత్రమేనన్నారు.పీడిత జనులను పాలకులుగా చూడాలనుకున్న అంబేడ్కర్ కలలను నిజం చేసినవాడు కాన్షీరామ్ అని తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలోని రోపార్ జిల్లా, కావాస్‌పూర్ గ్రామంలో 1934 మార్చి 15న జన్మించిన ఆయన, 1959లో పూణేలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిలటరీ టెక్నాలజీలో పరిశోధన అధికారిగా నియమితులయ్యారని గుర్తు చేశారు. రామ్‌దాసియా చమర్ కులంలో పుట్టి సైంటిస్ట్‌గా ఎదిగి తన లక్ష్యాన్ని నిర్దేశించుకున్న అనమాన వ్యక్తి కాన్షీరామ్ అని, అంబేడ్కర్ రచించిన 'కుల నిర్మూలన' పుస్తకం ఆయనను తీవ్రంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# చైత్యభూమి సాక్షిగా "బాబాసాహెబ్ డైరీ" ఆవిష్కరణ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 10:

సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.వి రత్నాకర్ రచించిన "బాబాసాహెబ్ డైరీ" తెలుగు, హిందీ, ఇంగ్లీష్ 3భాషల్లోని పుస్తకాల ఆవిష్కరణ చైత్యభూమి వద్ద జరిగింది. శనివారం ఉదయం ముంబై దాదర్లోని చైత్యభూమి వద్ద , మలేసియా దేశం నుంచి విచ్చేసిన కస్తూరి విజయం ప్రచురణకర్త పామిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక అభిమానుల తీం హాజరై డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కు ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం సుధీర్ రెడ్డి "బాబాసాహెబ్ డైరీ" లోఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ దిన చర్య గురించి సవిస్తరంగా వివరించారు. ఈ గొప్ప పుస్తకం ద్వారా సామాన్య ప్రజలకు జ్ఞానోదయం కల్గుతుందని, ప్రజల పాలిట సొంతం చేయడానికి దీనిని ప్రచురించమని ఆయన తెలియజేశారు. ఈ శుభ సందర్భంగా సుధీర్ రెడ్డి గారిని బుద్ధుడి "పంచశీల ఖండువ" కప్పి సమితి అధ్యక్షులు గోవింద్ సగ్యలల్లు సన్మానించారు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భారతీయ సమాజ్ సేవ సమితి మాదిగ –ముంబై ఉపాధ్యక్షులు సాయన్న మాత్రే, ప్రధాన కార్యదర్శి గురునాథ్ కేదాస్, శివాప్ప ప్యాట, ఎంటిబిఎఫ్ నాయకులు సంటి శంకర్ మహరాజ్, భీంరత్న మాలజీ, నారపాక లక్ష్మణ్ మహరాజ్, ఎం. మాలజీ పాల్గొన్నారు.



# సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య జన్మదిన వేడుకలు

## శంషాబాద్‌లో కేక్ కట్ చేసి సన్మానించిన సిపిఐ శ్రేణులు

శంషాబాద్, అక్టోబర్ 09 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కౌన్సిల్ సభ్యులు, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పాలమాకుల జంగయ్య పుట్టినరోజు సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు.శంషాబాద్ మండల సిపిఐ పార్టీ కార్యదర్శి నర్రా గిరి ఆధ్వర్యంలో ఎల్ఐటి హోటల్‌లో కేక్ కట్ చేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రాచమల్ల యాదగిరి, పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య, టి. రామకృష్ణ, శేర్లింగంపల్లి మండల కార్యదర్శి చందు యాదవ్, శంషాబాద్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలి

సిద్దిపేట : సిద్దిపేట నుండి సిరిసిల్ల వరకు రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో రైల్వే ప్రాజెక్టు ముఖ్య అధికారులు, రెవెన్యూ,ఆర్ అండ్ బి, పిఆర్ అధికారులతో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎన్. నవ్య శ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.జిల్లాలో చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో రైల్వే లైన్ నిర్మాణంలో పెండింగ్ లో సమస్యలు, బ్రిడ్జి నిర్మించే ప్రాంతాల్లో భూ సేకరణ వివరాలు గూర్చి రైల్వే అధికారులు కలెక్టర్ కి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. చిన్నకోడూరు మండలంలో చిన్నకోడూరు మాచాపూర్, గంగాపూర్ విఠలాపూర్, నారాయణరావు పేట మండలంలో గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో పెండింగ్ సమస్యల గూర్చి అధికారులతో క్షుప్తంగా చర్చించారు. పెండింగ్ లో ఉన్న ప్రాంతాలను రైల్వే, రెవెన్యూ, అర్ అండ్ బి, పిఆర్, అందరూ కలిసి పర్యవేక్షణ చేసి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టే దగ్గర డైవర్షన్ బీటీ రోడ్ ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, భూ సేకరణ పెండింగ్ తదితర పూర్తి సమాచారాన్ని జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రైల్వే పనుల వల్ల పక్కన రైతులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చెయ్యాలని, బ్రిడ్జి నిర్మాణాలు వేగంగా పూర్తి చెయ్యాలని రైల్వే అధికారులను ఆదేశించారు. రైల్వే పనులు అయ్యేంతవరకు స్థానిక శాఖల అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డిఓ సదానందం, రైల్వేస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మూర్తి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్లిష్ట వెన్నెముక సమస్యలకు ఎండోస్కోపిక్ చికిత్స

## - నిమ్స్‌లో అత్యాధునిక శస్త్రచికిత్సలు.. అర్హులకు ఉచితం!

**హైదరాబాద్,**
**అక్టోబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)**

నడకను ప్రభావితం చేస్తూ, సకాలంలో చికిత్స అందకపోతే పక్షవాతానికి దారితీసే సంక్లిష్ట వెన్నెముక సమస్యలకు నిమ్స్ ఆసుపత్రిలో అత్యాధునిక ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీలతో చికిత్స అందిస్తున్నారు. చిన్న కోతలతో నిర్వహించే ఈ శస్త్రచికిత్సల ద్వారా వెన్నుపాముపై ఒత్తిడిని తగ్గించడంతోపాటు, చుట్టుపక్కల కండరాలు, కణజాలాలకు నష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. అర్హులైన రోగులకు ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఈ చికిత్సను ఉచితంగా పొందే అవకాశం కల్పిస్తున్నారు.

**గట్టిపడుతున్న లిగమెంట్లతో ముప్పు**

సర్వైకల్ స్పాండిలోసిస్, మెడ భాగంలో ఆసిఫికేషన్ ఆఫ్ పోస్టీరియర్ లాంగిట్యూడినల్ లిగమెంట్ (ఓపీఎల్ఎల్), ఛాతీ భాగంలో ఆసిఫికేషన్ ఆఫ్ ఎల్లో లిగమెంట్ (ఓవైఎల్) వంటి సమస్యలతో వెన్నెముకలోని లిగమెంట్లు గట్టిపడి, స్పైనల్ కెనాల్ ఇరుకుగా మారుతుంది.

దీంతో వెన్నుపాముపై ఒత్తిడి పెరిగి నరాల పనితీరు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఫ్లోరోసిస్‌తో సంబం ధమున్న ఇలాంటి సమస్యలు తెలంగాణలోనూ కనిపిస్తున్నాయి. చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, వస్తువులను పట్టుకోవడంలో ఇబ్బంది, కాళ్లు బిగుసుకుపోవడం, నడుస్తూ తూలడం, తరచూ పడిపోవడం, మూత్ర నియంత్రణ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి ముదిరితే నడవలేని పరిస్థితి ఏర్పడవచ్చు.




**చిన్న కోతలతో శస్త్రచికిత్స**

ఇలాంటి సంక్లిష్ట సమస్యలకు సాధారణంగా పెద్ద కోతతో ఓపెన్ సర్జరీ నిర్వహించాల్సి ఉంటుంది. కండరాలను విస్తృతంగా విడదీయడంతోపాటు, వెన్నెముకలో పలు స్థాయుల్లో ఒత్తిడిని తొలగించడం, అవసరమైనవారికి స్క్రూలు, రాడ్లతో వెన్నెముకను స్థిరపరచడం వంటి ప్రక్రియలు చేపడతారు. అయితే ఎంపిక చేసిన రోగులకు యూనిలేటరల్ బైపోర్టల్ ఎండోస్కోపీ (యూబీఈ) విధానంలో చికిత్స అందిస్తూ నిమ్స్ వైద్యులు ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. నిమ్స్ న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ యెర్రమనేని వంశీకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మరియం అఫీఫా నేతృత్వంలోని బృందం ఈ శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. డాక్టర్ వసుంధర ఎస్. రంగన్, డాక్టర్ ఆదిత్య మడిశెట్టి, డాక్టర్ అక్షయ్ సింగ్ రాజ్‌పుత్ ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. సంక్లిష్టమైన మెడ, ఛాతీ వెన్నెముక సమస్యలతో పాటు ఎంపిక చేసిన స్పైనల్ ట్యూమర్లకు కూడా ఎండోస్కోపిక్ విధానాలను వినియోగిస్తున్నారు.

**అర సెంటీమీటర్ కోతలతోనే..**

యూబీఈ పద్ధతిలో సుమారు అర సెంటీమీటర్ పరిమాణంలో రెండు చిన్న కోతలు పెడతారు.

ఒకదాని ద్వారా హైడెఫినిషన్ కెమెరాను, మరోదాని ద్వారా శస్త్రచికిత్స పరికరాలను ప్రవేశపెడతారు. కెమెరా ద్వారా వెన్నెముక నిర్మాణాలను స్పష్టంగా పరిశీలిస్తూ, వెన్నుపాముపై ఒత్తిడి కలిగించే ఎముక లేదా గట్టిపడిన లిగమెంట్ భాగాన్ని తొలగిస్తారు. దీనివల్ల కండరాలు, జాయింట్లు, వెన్నెముకకు మద్దతునిచ్చే నిర్మాణాలకు నష్టం తగ్గే అవకాశం ఉంటుంది.

**త్వరగా కోలుకునే అవకాశం**

నిమ్స్ వైద్య బృందం ఇప్పటికే పలువురు రోగులకు, సంక్లిష్టమైన మల్టీలెవల్ సర్వైకల్, థొరాసిక్ సమస్యలకూ ఎండోస్కోపిక్ డీకంప్రెషన్ శస్త్రచికిత్సలు నిర్వహించింది. శస్త్రచికిత్స సమయంలో వెన్నుపాము పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ఇంట్రా ఆపరేటివ్ న్యూరోఫిజియాలజికల్ మానిటరింగ్ సాంకేతికతను వినియోగి స్తున్నారు. చిన్న కోతలు, కండరాలకు తక్కువ నష్టం వంటి కారణాలతో శస్త్రచికిత్స అనంతరం నొప్పి తగ్గడం, త్వరగా నడవగలగడం, వేగంగా కోలుకోవడం వంటి ప్రయోజనాలు ఉండవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే ఈ విధానం అందరికీ అనుకూలం కాదని, రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రతను బట్టి చికిత్సను నిర్ణయిస్తామని స్పష్టం చేస్తున్నారు.

**దాతల సహకారంతో అధునిక పరికరాలు**

నిమ్స్‌లో ఎండోస్కోపిక్ శస్త్రచికిత్సలకు అవసరమైన యూబీఈ పరికరాలను భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్), రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సన్‌షైన్ విరాళంగా అందించాయి. ప్రభుత్వ వైద్యరంగంలో అత్యాధునిక మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద, మధ్యతరగతి రోగులకు మెరుగైన వైద్య సేవలు చేరువవుతున్నాయి.

**కార్పొరేట్ ఆసుపత్రులతో పోలిస్తే భారీ వ్యయభారం తగ్గింపు**

కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ తరహా సంక్లిష్ట వెన్నెముక శస్త్రచికిత్సలకు సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. అయితే అర్హత, పథకం నిబంధనలకు అనుగుణంగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిమ్స్‌లో ఉచితంగా చికిత్స పొందవచ్చు. దీంతో ఖరీదైన ఆధునిక వైద్యాన్ని ఆర్థిక భారం లేకుండా పొందేందుకు పేద, మధ్యతరగతి కుటుంబాలకు అవకాశం కలుగుతోంది.




# విద్యతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలి

**-హ్యామ్స్ టెక్ వ్యవస్థాపకురాలు అజిత రెడ్డి**




**హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)**

విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని హ్యామ్స్ టెక్ వ్యవస్థాపకురాలు అజిత రెడ్డి సూచించారు. హైదరాబాద్ నార్సింగిలోని ది అడ్రస్ కన్వెన్షన్ సెంటర్‌లో హ్యామ్స్ టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.

వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆటపాటలతో అలరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందడి చేశారు. నూతన విద్యార్థుల పరిచయ వేదికగా నిర్వహించిన ఈ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగాయి. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# ఇందిరా పార్క్‌లో అలై బలాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

## ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ ప్రథమ మహిళ జానకి శుక్లా, ప్రముఖులు



**హైదరాబాద్,**
**అక్టోబరు 10 (ప్రజా కలం ప్రతినిధి):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద అలై బలాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి నిర్వహించిన ఈ వేడుకల్లో తెలంగాణ ప్రథమ మహిళ జానకి శుక్లా,కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి,మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ నాయకుడు ఆలేటి మహేశ్వర్ రెడ్డి సతీమణి ఆలేటి కవితా రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పూలతో బతుకమ్మ లను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటలతో జరుపుకునే ఈ పండుగ మహిళల్లో ఐక్యతను, సామాజిక అనుబంధాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా తెలంగాణ మహిళలకు జానకి శుక్లా, కావ్య కిషన్ రెడ్డి, బండారు దత్తాత్రేయ, ఆలేటి కవితా రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని, మహిళలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. తెలంగాణ అస్తిత్వానికి, ఆడవడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తరతరాలకు అందించేలా ఇలాంటి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలై బలాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యాన్ని చాటిచెప్పింది.



# ఆర్చర్ చికితకు బండారు దత్తాత్రేయ సన్మానం

## ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలతో తెలంగాణకు గర్వకారణం

**హైదరాబాద్ ,అక్టోబరు 10 (ప్రజా కలం ప్రతినిధి):**

ఇటీవల జపాన్‌లో జరిగిన 2026 ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఆర్చరీ మహిళల జట్టు, మిక్స్‌డ్ జట్టు విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన యువ ఆర్చర్ తనిపర్తి చికితను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం హైదరాబాద్‌లోని రాంనగర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన చికిత సాధారణ రైతు కుటుంబం నుంచి ఎదిగి అంతర్జాతీయ స్థాయిలో రెండు స్వర్ణ పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు తొలి ఒలింపిక్ కోటా సాధించడంలో ఆమె కీలక పాత్ర పోషించడం అభినందనీయమని పేర్కొన్నారు. 2025లోనూ స్వర్ణ పతకం సాధించిన చికిత, 2026 ఆసియా క్రీడల్లో మరో రెండు స్వర్ణ పతకాలు గెలుచుకోవడం ఆమె విలువిద్యలో చూపుతున్న నైపుణ్యం, పట్టుదల, కృషికి నిదర్శనమని అన్నారు. భారతీయ సంస్కృతిలో విలువిద్యకు ప్రాచీనమైన విశిష్ట స్థానం ఉందని, అటువంటి క్రీడలో అంతర్జాతీయ విజయాలు సాధించిన చికిత తెలంగాణ బిడ్డ కావడం రాష్ట్ర ప్రజలకు గర్వకారణమని తెలిపారు. అంతర్జాతీయ వేదికపై భారత కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన చికితకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని దత్తాత్రేయ ఆకాంక్షించారు.



# ఆత్మలింగ మహాగణపతి దేవస్థానంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

## సాంప్రదాయ దుస్తుల్లో ఆడిపాడిన మహిళలు.. పూలతో బతుకమ్మల అలంకరణ

**మల్కాజిగిరి,**
**అక్టోబరు 10 (ప్రజా కలం ప్రతినిధి):**

మల్కాజిగిరి బాల నరసింహ నగర్‌లోని ఆత్మలింగ మహాగణపతి దేవస్థానంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా మొదటి రోజు నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో కాలనీలోని మహిళలు, ఆడపడుచులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ఆలయానికి తీసుకొచ్చారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆడిపాడారు. పూల సోయగాలు, మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో ఆలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బతుకమ్మ నవరాత్రుల్లో తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ తెలంగాణ ఆడపడుచులు తమ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివశర్మ బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని ప్రార్థించారు.బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు, ప్రకృతిలో లభించే పూలకు ప్రాధాన్యాన్ని తెలియజేస్తుందని ఈ వేడుకలు చాటిచెప్పాయి. కాలనీలోని మహిళలు, చిన్నారులు, ఇతర కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు.






Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com